'అయ్యా..! మీరైనా మా కష్టాలు చూడండి. మా బాధలు వినండి. మమ్మల్ని ఆదుకునేలా ప్రభుత్వాలకు నివేదికలు ఇవ్వండి' అంటూ జిల్లా రైతాంగం కేంద్ర కరువు బృందం ఎదుట ఘోషించడానికి సిద్ధంగా ఉంది. కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడం కోసం కేంద్ర కరువు బృందం బుధవారం జిల్లాకు రానుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ నష్టాలను కళ్లారా చూసి ఆదుకునే చర్యలు తీసుకోవాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

- అనంతపురం, ఆంధ్రజ్యోతి



శింగనమలలో ఏపుగా పెరిగినా దిగుబడి లేని వేరుశనగ పైరు(ఫైల్)

ఊరట దొరికేనా..?

కష్టాల కడలిలో జిల్లా రైతులు / ఖరీఫ్‌లో వర్షాభావంతో తీవ్రనష్టాలు

- ఏ పంట సాగు చేసినా నష్టమే
- ఏడు ప్రాంతాలే కరువు మండలాలట
- నేడు క్షేత్రస్థాయిలో కేంద్ర కరువు బృందం పర్యటన
- బాధలు చూసి, విని ఆదుకోవాలని అన్నదాతల ఆకాంక్ష

గత ఖరీఫ్‌లో పరిస్థితి ఇలా..

గత ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో అన్ని రకాల పంటలు దెబ్బతిన్నాయి. ప్రధాన పంట వేరుశనగతో పాటు ఇతర పంటల కీలక దశల్లో వర్షం పడలేదు. దీంతో ఆయా పంటల్లో దిగుబడి భారీగా తగ్గింది. పంట కీలక దశలో వర్షం పడకపోయినా ఖరీఫ్ సీజన్ మొత్తాన్ని తీసుకొని సాధారణ వర్షపాతం కంటే అధిక వర్షపాతం నమోదు అయ్యిందన్న సాకుతో జిల్లాలో ఏడు మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. అందులో నార్పల, అనంతపురం, విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాలు ఉన్నాయి. జిల్లాలోని మిగతా మండలాల్లో కూడా వర్షాభావంతో వేరుశనగతో పాటు ఇతర పంటలు భారీగా దెబ్బతిన్నా ఏడు మండలాలనే కరువు ప్రాంతాలుగా ప్రకటించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భారీ పంట నష్టం

గత ఖరీఫ్‌లో వర్షాభావంతో వేరుశనగ పంట తీవ్రంగా దెబ్బతింది. కొన్ని ప్రాంతాల్లో దిగుబడి లేకపోవడంతో పంటను దున్నేశారు. పంట కోత దశలో అకాల వర్షాలు పడటంతో అరకొరగా వచ్చిన దిగుబడి కూడా తడిసిపోయింది. వర్షానికి తడిసిన వేరుశనగ కట్టె పశుగ్రాసానికి కూడా పనికిరాకుండా కుళ్లిపోయింది. వేరుశనగ పంటకు కీలక సమయం పూత, ఊడలు దిగే దశ, పిందెలు ఊరే సమయాల్లో వర్షం రాలేదు. దీంతో వేరుశనగ పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేరుశనగతోపాటు ఇతర పంటల కీలక దశల్లోనూ వర్షం పడలేదు. దీంతో ఆయా పంటల దిగుబడి కూడా భారీగా తగ్గింది. గతేడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 7.90 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఇందులో 1.11 లక్షల ఎకరాల్లో వేరుశనగ పంట సాగైంది. వేరుశనగ పంట సాగు కోసం ఎకరాకు రూ.30వేల నుంచి రూ.35వేల దాకా పెట్టుబడి పెట్టారు. వర్షాలు సక్రమంగా కురిసి ఉంటే ఎకరాకు 15 నుంచి 20 బస్తాలు(ఒక బస్తా 42 కిలోలు) వరకు దిగుబడి వచ్చేది. కొన్ని మండలాల్లో ఎకరాకు 3 నుంచి 5 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చినట్లు రైతులు పేర్కొన్నారు.

రూ.19.98 కోట్ల పంట నష్టపరిహారం అవసరమని నివేదికలు

జిల్లాలో కరువు ప్రాంతాలుగా ప్రకటించిన ఏడు మండలాల్లోని 12678 మంది రైతులకు రూ.19.98 కోట్ల పంట నష్టపరిహారం అవసరమని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదికలు పంపింది. ఇందులో 8020 మంది వేరుశనగ రైతులకు రూ.13.25 కోట్లు, 2393 మంది పత్తి రైతులకు రూ.4.84 కోట్లు, 1550 మంది ఆముదం రైతులకు రూ.1.27 కోట్లు, 421 మంది జొన్న రైతులకు రూ.30.71 లక్షలు, 15 మంది పెసర రైతులకు రూ.2 లక్షలు, ఇతర పంటలకు సంబంధించి 279 మంది రైతులకు రూ.27.85 లక్షల నష్టపరిహారం అవసరమని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కరువు మండలాలుగా ప్రకటించిన ప్రాంతాల్లో మాత్రమే పంటనష్టం అంచనా వేశారు గానీ కరువు మండలాల జాబితాలోని లేని పంటనష్టం జరిగినా పరిగణలోకి తీసుకోకపోవడం రైతులకు ఆవేదన కలిగిస్తోంది. ఈ అంశాన్ని కేంద్ర కరువు బృందం పరిగణలోకి తీసుకొని, న్యాయం చేయాలనే డిమాండ్ రైతులు, రైతు సంఘాల నుంచి వ్యక్తమవుతోంది.

పంటల కీలక దశలో వర్షాభావం



ఆత్మకూరులో దిగుబడి లేక పోవడంతో ట్రాక్టర్‌తో దున్నేస్తున్న దృశ్యం

వేరుశనగ, ఇతర పంటల కీలక దశల్లో వర్షాభావం వెంటాడింది. గతేడాది జూలై, సెప్టెంబరు మాసాలు పంటలకు కీలక సమయం. ఎందుకంటే అది వేరుశనగ పంట ఊడలు దిగే సమయం, పిందె ఊరే దశ. ఆ సందర్భంలో వాన పడలేదు. కంది, ఇతర పంటల్లోనూ కీలక దశల్లో వాన పడలేదు. పంటలకు అవసరం లేని సమయాల్లో వర్షం బాగా కురిసింది. ఈ భిన్నమైన పరిస్థితులతో పంటలకు ప్రయోజనం లేకుండా పోయింది. విత్తనం వేసే సమయం జూన్ మొదటి పక్షం రోజులు, ఆగస్టు మూడో వారంలో మాత్రమే మంచి వర్షపాతం నమోదైంది. జూన్ సాధారణ వర్షపాతం 61 మి.మీలు కాగా ఆ నెల తొలి పక్షం రోజుల్లోనే 143 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా పక్షం రోజుల్లో కేవలం 4.7 మి.మీ వర్షపాతం నమోదైంది. జూలై మాసంలో వర్షాభావం వెంటాడింది. ఆగస్టులో పక్షం రోజులపాటు సరైన వర్షం పడలేదు. ఆగస్టు నెల 14 నుంచి 22వతేదీ మధ్య కాలంలో భారీ వర్షాలు పడ్డాయి. ఆ తర్వాత సెప్టెంబరు మొదటి వారంలో ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. ముఖ్యంగా జూన్ 15 నుంచి ఆగస్టు 15 దాకా రెండు నెలల్లో కొన్ని మండలాల్లో 50 రోజులపాటు చినుకు జాడేలేదు.





శింగనమల మండలంలో ట్రాక్టర్‌తో పంటను దున్నుతున్న దృశ్యం

ప్రతి సారీ ఆలస్యంగానే

ఖరీఫ్‌లో పంటనష్టం జరిగిన ప్రతి సారీ కరువు బృందం ఆలస్యంగానే క్షేత్ర స్థాయి పరిశీలనకు వస్తోంది. ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంటకు సంబంధించి కోతలు సెప్టెంబరు, అక్టోబరు నెలల్లోనే పూర్తవుతాయి. ఆముదం, పత్తి తదితర రకాల పంటలు నవంబరు, డిసెంబరు నెలల్లోనే కోతలు పూర్తయ్యాయి. పంట కోత సమయాల్లోనే పంటనష్టంపై అంచనా వేసేందుకు కరువు బృందం సభ్యులు క్షేత్ర స్థాయి పరిశీలనకు వస్తే వాస్తవ పరిస్థితులు నేరుగా తెలుసుకునే అవకాశం ఉంది. అలా కాకుండా పంట కోతలు పూర్తయిన తర్వాత కరువు బృందం సభ్యులు పర్యటిస్తుండటంతో వాస్తవ పరిస్థితులు తెలుసుకునే అవకాశం లేకుండా పోతోంది. కేవలం ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా పంట నష్టంపై బృందం సభ్యులకు వివరించాల్సిన పరిస్థితులను జిల్లా యంత్రాంగం ఎదుర్కొంటోంది.

అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించాలి

గతేడాది జిల్లా అంతటా కరువు వచ్చింది. వర్షాభావంతో జిల్లాలోని అన్ని మండలాల్లో పంటనష్టం జరిగింది. సీజన్ మొత్తం వర్షపాతాన్ని పరిగణలోకి తీసుకొని ఏడు మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా గుర్తించడం అన్యాయం. కేంద్ర బృందం వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించి బాధిత రైతులకు పంటనష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి. కరువు నివారణకు రూ.10వేల కోట్లు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి. పంట రుణాలతోపాటు ప్రైవేటు అప్పులు ఒకే సారి మాఫీ చేయాలి. పంటనష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ మేరకు ప్రతి రైతులకు 10 ఎకరాల దాకా పంటనష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలి. డ్రిప్, స్ప్రింకర్లకు జీఎస్టీని రద్దు చేసి, ప్రతి రైతుకు 90 శాతం సబ్సిడీతోనే పరికరాలు సరఫరా చేయాలి. జిల్లాలో పెండింగ్‌లోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా చొరవ చూపాలి. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు గ్రామ పంచనామా ఆధారంగా రూ.10 లక్షల పరిహారం అందించి చేయూతనివ్వాలి. అన్ని గ్రామాల్లో పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.



- చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

నేడు కరువు బృందం పర్యటన

గత ఖరీఫ్‌లో జరిగిన పంటనష్టంపై క్షేత్ర స్థాయిలో అధ్యయనం కోసం కేంద్ర కరువు బృందం బుధవారం జిల్లాలో పర్యటించనుంది. మధ్యాహ్నం 2 గంటలకు శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు అనంతపురం రూరల్ మండలం మన్నీలకు కరువు బృందం సభ్యులు చేరుకుంటారు. ఆ గ్రామంలో గతేడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో దెబ్బతిన్న రైతు వన్నప్పకు చెందిన ఆముదం పంటను పరిశీలిస్తారు. ఆ తర్వాత స్థానిక రైతులతో ముఖాముఖి మాట్లాడతారు. అక్కడి నుంచి రాప్తాడు మండలానికి చేరుకొని, రైతు కొండప్పకు చెందిన ఉలవ పంటను పరిశీలిస్తారు. అక్కడే స్థానిక రైతులతో మాట్లాడతారు.

శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టాలి



జిల్లాలో శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. కరువు వచ్చిన ప్రతిసారీ కేంద్ర కరువు బృందాలు పర్యటించడం, పంటనష్టంపై ఆరా తీసి వెళ్లిపోతున్నాయి. ఇప్పటి దాకా జిల్లాలో శాశ్వత కరువు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎవరూ ప్రణాళికలు రూపొందించి అమలు చేయకపోవడం బాధాకరం. సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సాగునీరు అందిస్తేనే కరువు నివారణ సాధ్యమవుతుంది. గతేడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో జిల్లా అంతటా పంట నష్టం జరిగినా ఏడు మండలాలనే కరువు ప్రాంతాలుగా గుర్తించడం అన్యాయం. దీనిపై కరువు బృందం సమగ్ర నివేదికలు ప్రభుత్వానికి సమర్పించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలి.

- మల్లికార్జున, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

అక్షర యోధుడికి అరుదైన వీడ్కోలు

వైద్య కళాశాలకు తేజ ప్రసాద్ భౌతిక కాయం

అక్షరాల బంధంతో ఆత్మీయ కుటుంబాన్ని ఏర్పాటు చేసుకున్న సీనియర్ జర్నలిస్టు తేజ ప్రసాద్‌కు అరుదైన వీడ్కోలు లభించింది. అనంతపురం నగరంలో 'ఆ నలుగురు' అంతిమ యాత్ర సాక్షాత్కారమైంది. రక్త సంబంధీకులు లేని ఆయన, దశాబ్దాలుగా ప్రెస్‌క్లబ్‌ను తన ఇంటిగా, జర్నలిస్టులను కుటుంబ సభ్యులుగా మార్చుకున్నారు. తీవ్ర అనారోగ్యంతో తుది శ్వాస విడిచిన ఆయనకు వందలాది మంది ప్రముఖులు, జర్నలిస్టులు జోహార్లు అర్పించారు. బరువెక్కిన హృదయాలతో ఆయన పార్థివ దేహాన్ని అనంత మెడికల్ కాలేజీకి అప్పగించారు. చెమ్మగిల్లిన కళ్లతో ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.



మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు పార్థివ దేహాన్ని అప్పగిస్తున్న జర్నలిస్టులు

7

వస్తే.. చూస్కుందాం..!

- హెచ్‌ఎంపీవీపై పెద్దాస్పత్రి యంత్రాంగం అప్రమత్తం
- కేసులొస్తే చికిత్సకు ఆస్పత్రిలో ప్రత్యేకవార్డు
- చికిత్స, వసతులపై అధికారుల సమీక్ష



చికిత్స అందించడం కోసం ఆస్పత్రిలోని మానసిక జబ్బుల విభాగంలో ఏర్పాటు చేసిన ప్రత్యేకవార్డు

అనంతపురం టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కొత్తగా జనంపై విరుచుకుపడుతున్న హెచ్‌ఎంపీవీపై జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది. ఇది ప్రమాదం కాదని వైద్యనిపుణులు చెబుతున్నా, పక్క రాష్ట్రాల్లో కేసులు పెరుగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా అప్రమత్తమవుతోంది. ఈ క్రమంలోనే ఏసమస్య వచ్చినా బాధితులకు వైద్య చికిత్సలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని వైద్యాశాఖను సీఎం ఇప్పటికే ఆదేశించారు. ఈ నేపథ్యంలో అనంత జిల్లాకు పెద్దదిక్కుగా ఉన్న అనంత సర్వజన ఆస్పత్రి వైద్యాధికారులు సైతం ముందస్తు చర్యలకు దిగారు. అందులో భాగంగా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పలు కీలక విభాగాల హెచ్‌ఓడీలు, డాక్టర్లతో మంగళవారం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. ఈసందర్భంగా హెచ్‌ఎంపీవీ కేసులు వస్తే బాధితులను ప్రత్యేక వార్డులో ఉంచి వైద్యచికిత్సలు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం మానసిక జబ్బుల విభాగంలో ఏర్పాట్లు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.



ఐదుగురు డాక్టర్లతో ప్రత్యేక కమిటీ

హెచ్‌ఎంపీవీ కేసులకు సంబంధించి పూర్తి స్థాయిలో పర్యవేక్షణకు ఆస్పత్రికి చెందిన పల్మనరీ హెచ్‌ఓడీ, జనరల్ మెడిషన్ హెచ్‌ఓడీ, పీడియాట్రిక్ హెచ్‌ఓడీ, కమ్యూనిటీ మెడిషన్ హెచ్‌ఓడీ, మైక్రోబయాలజీ హెచ్‌ఓడీలతో ఆస్పత్రి సూపరింటెండెంట్ కమిటీని నియమించారు. ఈకమిటీలో నోడల్ ఆఫీసర్‌గా పల్మనరీ హెచ్‌ఓడీ డాక్టరు రామస్వామి వ్యవహరిస్తారని సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈకమిటీ కేటాయించిన ప్రత్యేక వార్డులో 20 పడకలకు అవసరమైన వసతులు, చికిత్స పరికరాలు, ఆక్సిజన్ సరఫరా, మందులు తదితర వాటిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటుంది. అలాగే కొత్తవైరస్ ఎలా వ్యాపిస్తుంది, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా నిత్యం ఆస్పత్రికి వచ్చే రోగులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఈ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఇలా జిల్లా సర్వజన ఆస్పత్రిలో ముందస్తు చర్యలు చేపట్టారు.

అవస్థలే అలంకరణ



శిథిలావస్థలో బడి భవంతి



- తాగునీటికి పొలం బాట..
- ఇళ్ల ముందు మురుగునీరు..
- వంక దాటితేనే చదువులు
- వర్షం కురిస్తే ఇళ్లలోకి కొండ నీరు
- అభివృద్ధికి దూరంగా అలంకరాయునిపేట

6

సొంతూరి కష్టాలపై కదిలిన మడకశిర ఎమ్మెల్యే

దరఖాస్తులకు సిద్ధం కండి

- సబ్సిడీ రుణాలు వచ్చేశాయోచ్
- స్వయం ఉపాధికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ...
- త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

6

ఖాళీ కార్యాలయం..!

- సమగ్ర శిక్షకు రెండేళ్లుగా లేని రెగ్యులర్ ఏపీసీ
- సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులూ ఖాళీ
- నోటిఫికేషన్ ఇచ్చి.. ఇంటర్వ్యూలు చేసి వదిలేశారు
- విద్యాశాఖ కమిషనర్ వద్ద ఫైలు..?



అనంతపురం విద్య, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రెగ్యులర్ పోస్టులు, ఫారిన్ సర్వీసు పోస్టులు అన్నీ ఖాళీనే. రెండేళ్లుగా రెగ్యులర్ ఏపీసీ లేరు. 2023 ఫిబ్రవరి నుంచి ఏపీసీ పోస్టులోకి ఇన్‌చార్జులు వస్తున్నారు. వచ్చిన వారంతా మూడు నెలలు.. ఆరు నెలలు.. ఎనిమిది నెలలు ఉండి వెళుతున్నారు. ఫారిన్ సర్వీసు కింద భర్తీ చేసే సెక్టోరియల్ పోస్టులు సైతం ఖాళీనే కనిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయం అధికారులు లేకుండా ఖాళీగా కనిపిస్తోంది. ఎన్నికల ముందు వైసీపీ బ్రాండ్ ఉన్న టీచర్లు అనధికారికంగా పాగా వేశారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా వచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చాక టీడీపీ బ్రాండ్ టీచర్లు ప్రాజెక్టులోకి వద్దాం అనుకున్నారు. అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇంటర్వ్యూలు చేశారు. కానీ ఇప్పటి వరకూ ఫలితాలు విడుదల చేయలేదు. సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులను భర్తీ చేయలేదు. కలెక్టర్‌గాని, డీఈఓగాని ఈ సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీ ఫైల్ జిల్లాను దాటి విద్యాశాఖ కమిషనర్ చెంతకు చేరిందని చెబుతూ.. డీఈఓ కార్యాలయ అధికారులు చేతులెత్తేస్తున్నారు.

రెగ్యులర్ ఏపీసీ వచ్చేనా..?

ప్రాజెక్టులో రెగ్యులర్ ఏపీసీ పోస్టు ఖాళీ పడి సుమారు రెండేళ్లు కావస్తోంది. 2023 ఫిబ్రవరి వరకూ ఏపీసీగా తిలక్ పనిచేశారు. ఆయన వెళ్లిన తర్వాత రెగ్యులర్ ఏపీసీని నియమించలేదు. ఇతర శాఖల నుంచి వచ్చిన వారు నిలకడగా ఉండటం లేదు. డీఈఓలు, అసిస్టెంట్ డైరెక్టర్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నారు. వారు కొన్ని నెలలు మాత్రమే పనిచేసి బదిలీ అవుతున్నారు. 2023 ఫిబ్రవరి తర్వాత సుమారు అర డజను మంది అధికారులు ఇన్‌చార్జి ఏపీసీలుగా పనిచేసి వెళ్లారు. ఇలా వచ్చి వెళ్లే వారితో వేగలేకున్నామని సిబ్బంది వాపోతున్నారు. రెగ్యులర్ ఏపీసీ ఉంటే తమ సమస్యలు పరిష్కారమవుతాయని అంటున్నారు. కానీ రెగ్యులర్ ఏపీసీ ఎప్పుడొస్తారా తెలియని పరిస్థితి. గత ఏడాది డిసెంబరు 21న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ 14 మందిని ఏపీసీలుగా నియమించారు. కానీ అనంతపురం జిల్లా పోస్టును మాత్రం ఖాళీగానే ఉంచారు.

నోటిఫికేషన్ ఎవరి కోసం..?

అనంతపురం సమగ్రశిక్ష ప్రాజెక్టులో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులు 8 ఖాళీగా ఉన్నాయి. జూలై 1న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. అక్టోబరు 1న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. కానీ ఇంత వరకూ ఫలితాలు విడుదల చేయలేదు. వైసీపీ ప్రభుత్వంలో ఆ బ్రాండ్ టీచర్లు నోటిఫికేషన్ లేకుండా వచ్చి పనిచేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు వచ్చాయి. జూన్‌లో కూటమి ప్రభుత్వం రాగానే పాత వారిని వెనక్కు పంపారు. దీంతో తమకు అవకాశం వస్తుందని కొందరు టీడీపీ బ్రాండ్ ఉన్న టీచర్లు సంబరపడ్డారు. ప్రాజెక్టులోకి రావాలని ఆశపడ్డారు. కానీ కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో వారి ఆశలు గల్లంతయ్యాయి. అయినా, పద్ధతి ప్రకారం నియామకాలు జరుగుతాయని భావించి, చాలా మంది నోటిఫికేషన్‌ను స్వాగతించారు. ఆశావహులు దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూలకు వెళ్లారు. కానీ ఫలితాలు విడుదల చేయకపోవడంతో ఉసూరుమంటున్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా కలెక్టర్, డీఈఓ వద్ద లేదని చెబుతున్నారు. ఫైల్ విద్యాశాఖ కమిషనర్ వద్ద ఉందని, తాము ఏమీ చేయలేమని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. సమస్య పరిష్కారం కావాలంటే విద్యాశాఖ కమిషనర్ దృష్టి సారించాల్సిందేనని అంటున్నారు.



ఆంధ్రజ్యోతి విజిట్



శింగనమల మండలం రాచేపల్లి పంచాయతీ మజరా.. అలంకరాయునిపేట. సుమారు వంద కుటుంబాలు, ఐదొందల జనాభా ఉండే చిన్న ఊరు ఇది. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ వంటి కనీస మౌలిక వసతులు లేక ఈ ఊరి జనం ఇబ్బంది పడుతున్నారు. వాటి పరిష్కారం కోసం స్వయంగా ఓ ఎమ్మెల్యే.. మరో ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం సమర్పించారు. మడకశిర ఎమ్మెల్యే స్వగ్రామం ఈ ఊరు. కానీ శింగనమల పరిధిలో ఉంది. దీంతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. ఎమ్మెల్యే బండారు శ్రావణిని డివిజన్ స్థాయి గ్రీవెన్స్‌లో సోమవారం కలిశారు. తన సొంతూరి కష్టాలను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సమక్షంలో ఎమ్మెల్యే శ్రావణికి వివరించారు. ఈ నేపథ్యంలో ఆ ఊరిని ఆంధ్రజ్యోతి మంగళవారం సందర్శించింది. అక్కడి ప్రజలతో మాట్లాడి.. ఊరి పరిస్థితిని తెలుసుకుంది.

- ఆంధ్రజ్యోతి, శింగనమల





అలంకరాయునిపేట ఊరు ముఖచిత్రం

అవస్థలే అలంకరణ

వంక దాటితేనే చదువులు

వర్షం కురిస్తే ఇళ్లలోకి కొండ నీరు

అభివృద్ధికి దూరంగా అలంకరాయునిపేట

సొంతూరి కష్టాలపై కదిలిన మడకశిర ఎమ్మెల్యే

తాగునీటికి పొలం బాట.. ఇళ్ల ముందు మురుగునీరు..

వ్యవసాయమే జీవనాధారం

అలంకరాయునిపేటలో రైతులు, రైతు కూలీల కుటుంబాలు ఉన్నాయి. వ్యవసాయమే ఈ ఊరి ప్రజల ప్రధాన జీవనాధారం. బోరుబావుల కింద చీనీ తోటలను సాగు చేశారు. దీంతోపాటు వరి సాగు చేస్తున్నారు. ఊరి పేరులో అలంకారం ఉన్నా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరే అలంకారంగా మారింది. వేసవిలో కాస్త పరవాలేదుగానీ, వర్షాకాలంలో మురుగునీరు, వర్షపునీరు చేరి పరిస్థితి దారుణంగా తయారౌతుంది. ఇంట్లోంచి కాలు బయట పెడితే బురదలో నడవాల్సింది. సీసీ రోడ్లు వేసే సమయంలో డ్రైనేజీ కాలువలను నిర్మించకపోవడమే దీనికి కారణం. దీనికితోడు వర్షం కురిస్తే కొండపై నుంచి నేరుగా ఊరిలోకి వస్తుంది. గతంలో కాలువలు ఉండేవని, కానీ పూడిపోయాయని ఊరి జనం అంటున్నారు. కొండమీది నుంచి వచ్చే నీటితో ఇబ్బంది తలెత్తకుండా గ్రామస్థులే మట్టితో అడ్డుకట్ట వేశారు. అయినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు.



ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇల్లు

కష్టంగా చదువులు

ఎంఎస్ రాజు సొంతూరులో గతంలో ఐదో తరగతి వరకూ చదువు అందుబాటులో ఉండేది. వైసీపీ హయాంలో మూడో తరగతికి పరిమితం చేశారు. పాఠశాలలో రెండు గదులు ఉన్నాయి. ఒకటి శిథిలావస్థకు చేరడంతో మరో గదిలో సర్దుకుంటున్నారు. బడి భవంతికి అనుకుని పేడ దిబ్బలు వేశారు. దీంతో కంపు కొడుతోంది. మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవంతిలో నిర్వహిస్తున్నారు. సొంత భవనం లేదు. మూడో తరగతి దాటాక ఇంకా చదవాలంటే ఊరు దాటాల్సిందే. ఈ ఊరికి 5 కి.మీ. దూరంలో ఉన్న సలకంచెరువులో జడ్పీ పాఠశాల ఉంది. ఆ బడికి పోవాలంటే చీలేపల్లి సమీపంలోని కూతలేరు వంక దాటాలి. వర్షాకాలంలో ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. పెద్దలకే ఇబ్బంది. అలాంటిది బడిపిల్లలు వెళ్లడం సాహసమే. ఈ కారణంగా కొందరు చదువులకు దూరమయ్యారు.



ఇరుకు గదిలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

రోగాలబారిన పడుతున్నాం..



మాది చిన్న గ్రామం. ఎన్నేళ్లు గడిచినా అభివృద్ధి జరగలేదు. సరైన రోడ్లు లేవు. మురుగునీటి కాలువలు లేవు. అపరిశుభ్ర వాతావరణంతో రోగాలబారిన పడుతున్నాము. అధికారులు స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.


-నారాయణస్వామి



అలంకరాయునిపేట నుంచి సలకంచెరువు పాఠశాలకు వెళ్లే దారిలో వంక

తాగునీటికి తంటాలు

ఊరిలో ఉప్పు నీరు వస్తుంది. ఇది పశువులు తాగేందుకూ పనికిరాదు. అందుకే గ్రామస్థులు వ్యవసాయ బోరుబావులను ఆశ్రయిస్తారు. పొలాల వద్ద నుంచి నీటిని తెచ్చి పశువులకు తాపిస్తారు. తామూ వినియోగిస్తారు. కూతలేరు వంకలో పంచాయతీ బోరు బావి ఉంది. అక్కడి నుంచి గ్రామానికి తాగునీటి పైప్‌లైన్ వేశారు. కానీ నాలుగు దశాబ్దాల క్రితం నాటివి కావడంతో దెబ్బతిన్నాయి. ఈ కారణంగా కలుషిత నీరు సరఫరా అవుతోంది.





పాత నీటి ట్యాంకు, గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న రోడ్డు

తాగునీరు ఇవ్వాలి..



మా ఊరికి 40 ఏళ్ల కిందట తాగునీటి పైపులైన్లు వేసి, ట్యాంకు నిర్మించారు. పైపులు పగిలిపోయాయి. గ్రామంలో పారే మురుగునీరు పైపుల్లోకి చేరుతోంది. నీరు కలుషితమై పశువులు కూడా తాగడం లేదు. అధికారులు కొత్త బోర్లు, పైప్‌లైన్‌లు వేయాలి. మాకు మంచి నీటిని సరాఫరా చేయాలి.

-ఆదిశేషారెడ్డి



ఓ ఇంటి ముందు మురుగునీరు

మా రాజుపై నమ్మకం ఉంది...



మా గ్రామానికి చెందిన ఎంఎస్ రాజు మడకశిర ఎమ్మెల్యేగా ఉన్నారు. మా రాజుకు మా గ్రామ సమస్యలు తెలుసు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేతో మాట్లాడి అభివృద్ధికి బాటలు వేస్తారనే నమ్మకం ఉంది.

- నాగముని



రచ్చ కట్ట మీద పులిజీతం అడుతున్న గ్రామస్థులు

గోడ కట్టాలి...



వర్షాలు వస్తే భయం భయంగా ఉంటుంది. కొండ దిగువ ప్రాంతంలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతుంది. తాత్కాలికంగా కొండకు మట్టి కట్ట వేసుకున్నాం. అధికారులు ఎమ్మెల్యేలు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి. కొండ చుట్టూ ప్రహరీ నిర్మించాలి.

-కాంతమ్మ

బ్రిడ్జి కట్టండి..



మా ఊరి పిల్లలు బడికి వెళ్లాలంటే వంక దాటాలి. మా పొలాలు కూడా అక్కడే ఉన్నాయి. వర్షాకాలంలో వంక ఉధృతంగా పారుతుంది. వంక దాటేందుకు చిన్న బ్రిడ్జిని నిర్మించాలి. లేదంటే చిన్నారులు చదువులకు దూరమౌతారు.

-వెంకటలక్ష్మి

దరఖాస్తులకు సిద్ధం కండి

సబ్సిడీ రుణాలు వచ్చేశాయోచ్

స్వయం ఉపాధికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ...

త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ కింద సబ్సిడీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ ఏడాదికి బీసీ కేటగిరీలోని కులాల ఆధారంగా రుణాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం రుణాలకు సంబంధించి వివరాలను ఓ ప్రకటనలో వెల్లడించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్ స్కీమ్ కింద స్వయం ఉపాధి కోసం రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకూ యూనిట్లను నిర్ణయించారు. ఇందులో లబ్ధిదారుడి వాటా కింద 50 శాతం సబ్సిడీ రానుంది. బ్యాంకుకు మిగతా 50 శాతం మొత్తాన్ని చెల్లించేలా ఆమోదం తెలిపారు. బీసీ కార్పొరేషన్ పరిధిలో ఈ ఏడాదికి 1728 యూనిట్లకు గానూ రూ. 32.90 కోట్లు, ఈబీసీ కార్పొరేషన్‌కు 102 యూనిట్లకుగానూ 1.77 కోట్లు, కమ్మ కార్పొరేషన్‌కు 58 యూనిట్లకుగానూ రూ. 1.01 కోట్లు, రెడ్డి కార్పొరేషన్‌కు 29 యూనిట్లకుగానూ రూ.50 లక్షలు, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు 21 యూనిట్లకు రూ.36 లక్షలు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 14 యూనిట్లకు రూ.24 లక్షలు, క్షత్రియ కార్పొరేషన్‌కు ఒక యూనిట్‌కుగానూ రూ.2 లక్షలు నిధులు విడుదల చేశారు. జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటు చేసుకునే నిరుద్యోగ యువత కోసం రూ.8 లక్షలు రుణాలు అందించను న్నారు. వీరికి 50 శాతం సబ్సిడీ వర్తించనుంది. బీసీ కార్పొరేషన్ పరిధిలో 35 యూనిట్లకు రూ. 2.80 కోట్లు, ఈబీసీ కార్పొరేషన్‌కు 17 యూనిట్లకు గానూ రూ.1.36 కోట్లు, కమ్మ కార్పొరేషన్‌కు 9 యూనిట్లకుగానూ రూ.72 లక్షలు, రెడ్డి కార్పొరేషన్‌కు 5 యూనిట్లకుగానూ రూ.40 లక్షలు, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్‌లకు 6 యూనిట్లకుగానూ రూ. 48 లక్షలు నిధులు విడుదల చేశారు. ఈ రుణాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునేందుకు ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ రూపొందిం చారు. ఈ వెబ్‌సైట్ త్వరలోనే అందుబాటులోకి రానుందని, తేదీని ప్రకటించేలోపు అర్హులైన ఆయా కేటగిరీల లబ్ధిదారులు తమ ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

టీఎన్‌ఏటీయూ జిల్లా అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

అనంతపురం విద్య, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ అనంతపురం జిల్లా అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం అనంతలక్ష్మి, ప్రధానకార్యదర్శి లక్ష్మీనరసమ్మ తెలిపారు. జిల్లాకు వచ్చిన వారు మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా మహిళా నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అడ్‌హక్ కమిటీ జిల్లా కన్వీనర్‌గా వీణ, సభ్యులుగా రుక్మిణీదేవి, శ్యామల, జమున, అరుణ, గౌరవాధ్యక్షులుగా రమాదేవిని నియమించారు. జిల్లాలోని 11 ప్రాజెక్టుల్లో టీఎన్‌ఏటీయూ సభ్యత్వాలను ముమ్మరం చేయాలని సూచించారు. సభ్యత్వాల నమోదుకే అడ్‌హక్ కమిటీ వేస్తున్నా మని, సభ్యత్వాల ప్రక్రియ ముగిసిన తర్వాత జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం దృష్టికి అంగన్‌వాడీల సమస్యలను తీసుకెళ్తామని వారు తెలిపారు.



మాట్లాడుతున్న రాష్ట్ర నేతలు

2016లో రూ. 4200 ఉన్న గౌరవ వేతనం టీఎన్‌ఏటీయూ పోరాటం వల్ల రూ. 10,500కి పెరిగిందని గుర్తుచేశారు. అంగన్‌వాడీల గ్రాట్యూటీ సమస్య పరిష్క రించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ మంజూరు చేయాలని, మినీవర్కర్లను మెయిన్ వర్కర్లుగా చేసే జీవోను విడుదలచేయాలని డిమాండ్ చేశారు.

బువ్వ కష్టాలకు చెక్

మైనార్టీ హాస్టల్‌లో మెనూ అమలుకు శ్రీకారం

సంక్రాంతి తరువాత విద్యార్థులకు భోజనం




మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అన్ని మైనార్టీ హాస్టళ్లల్లో మెనూ(భోజనం)ను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో విద్యార్థులకు భోజన కష్టాలు తీరనున్నాయి. ఇన్నాళ్లు ప్రభుత్వం ఇచ్చే రూ.1600లతోనే నెలంతా ఇబ్బంది పడుతూ ఆకలి తీర్చుకుంటున్న విద్యార్థులకు ఆ బాధలు తప్పనున్నాయి. ఇక మీదట వసతి గృహాల్లోనే విద్యార్థులకు భోజనం పెట్టేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలోనే ఆ శాఖ రాష్ట్ర అధికారులు వంట సామగ్రి తదితర వాటికి సంబంధించిన నివేదికలు తెప్పించుకున్నారు. నగరంలోని శారదానగర్ మైనార్టీ పోస్ట్‌మెట్రిక్ బాలుర వసతిగృహం ఉంది. అయితే అందులో దాదాపు కొన్నేళ్లుగా విద్యార్థులకు మెనూ అమలుకు అధికారాలివ్వలేదు. దీంతో డైట్ బిల్లులు వచ్చిన సమయంలో ఆ విద్యార్థుల ఖాతాలకు నెలకు ఒక్కొక్కరికి రూ.1600 జమ చేసేవారు. ఆ కొద్దిపాటి మొత్తం విద్యార్థులకు నెలంతా సరిపోయేది కాదు. దీంతో ఇంటి నుంచి తల్లిదండ్రులు పంపే డబ్బుతో సర్దుబాటు చేసుకునేవారు. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో మైనార్టీ విద్యార్థులకు ఈ బాధలు తప్పనున్నాయి.

హాస్టల్ సామర్థ్యం పెంచితే...

మైనార్టీ బాలుర కాలేజీ వసతిగృహంలో గతంలో 50 మంది విద్యార్థులకే అవకాశం కల్పించారు. దీంతో ఎంతో మంది పేద మైనార్టీ విద్యార్థులకు ఇబ్బందిగా ఉండేది. అందులో మెనూ కూడా అమలు చేయకపోవడంతో హాస్టల్‌లో 20 మందికి మించి ఉండేవారు. కాదు. ఈ ఏడాది కూడా 25 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మెనూను సక్రమంగా అమలు చేస్తే మరింత మంది విద్యార్థులు పెరిగే అవకాశముందన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపై జిల్లా అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు సమాచారం.

సంక్రాంతి తర్వాత మెనూ అమలు



నెల కిందటే మెనూ అమలుకు కావాల్సిన వంట సామగ్రి ఇతర వస్తువులకు సంబంధించి నివేదికలు తయారు చేసి రాష్ట్ర అధికారులకు పంపాం. అక్కడి నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఈ నేపథ్యంలోనే పొరుగు హాస్టల్ వార్డెన్లతో మాట్లాడుతున్నాం. వారి వద్ద వంట సామగ్రి ఉంటే దానితోనే సంక్రాంతి సెలవుల అనంతరం హాస్టల్ విద్యార్థులకు మెనూను అమలుచేస్తాం. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య పెంచే విషయంపై అధికారులకు వివరించాం. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- రామసుబ్బారెడ్డి, ఏడీ, మైనార్టీ సంక్షేమశాఖ

మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలి

ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్

అనంతపురం అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు తక్షణమే మినిమల్ టైం స్కేల్ అమలు చేయాలని ఆ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రైతు బజార్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ నాయక్, ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మిలతో కలిసి మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ శాఖలు, యూనివర్సిటీలు, సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్‌ను (ఎంటీఎస్) వర్తింపజేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గత టీడీపీ హయాంలో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా తమను కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగంలోకి తీసుకున్నారన్నారు. గత పదేళ్లుగా వ్యవసాయ శాఖలో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ఎంపీఈఓలకు ఇతర శాఖల్లోని ఉద్యోగుల తరహాలోనే సమాన పనికి సమాన వేతనం అందించే విధంగా మినిమమ్ టైం స్కేల్‌ను తక్షణమే వర్తింపజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు సుధాకర్, గంగరాజు, అపర్ణ, ఉమా, శిరీష, ధనలక్ష్మి, రెస్మా, నలినక్ష తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్

12 వరకు అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై ఈనెల 12వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని కలెక్టరు వినోద్‌కుమార్ మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. ఈనెల ఏడో తేదీకే గడువు ముగిసినా ప్రభుత్వం మరో ఐదు రోజులు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అప్పటివరకు నిర్దేశించిన ప్రాంతాలలో అధికారులు అందుబాటులో ఉంటారని, ఎవరికైనా అభ్యంతరం ఉంటే రాతపూర్వకంగా తెలియజేయవచ్చన్నారు. స్వీకరించిన అభ్యంతరాలను ఈనెల 16వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. అనంతరం వచ్చినవాటిపై తనిఖీ చేసి ఈనెల 20న గ్రామ సచివాలయాల వద్ద ప్రదర్శిస్తారన్నారు.

విభిన్నప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ బాధ్యతల స్వీకరణ



ఏడీ వినోద్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): విభిన్నప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీగా బి.వినోద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకూ ఏడీగా ఉన్న అబ్దుల్ రసూల్ గతనెల ఉద్యోగ విరమణ పొందారు. చిత్తూరులోని అదే శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బి.వినోద్‌ను ఆ శాఖ రాష్ట్ర అధికారులు ఉమ్మడి అనంత జిల్లా ఏడీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ఏడీకి ఆ శాఖ అధికారులు, సిబ్బంది, పలువురు విభిన్న ప్రతిభావంతులు శుభాకాంక్షలు తెలిపారు.

వాస్కో రైళ్ల పాక్షిక రద్దు

గుంతకల్లు, జనవరి7(ఆంధ్రజ్యోతి): నైరుతి రైల్వేలోని కాస్టిల్ రాక్-కులెమ్ సెక్షన్‌లో జరుగుతున్న మెయింటెనెన్స్ వర్కుల కారణంగా గుంతకల్లు మీదుగా వెళ్లే వాస్కోడగామా రైళ్లను పాక్షికంగా రద్దు చేయనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. షాలిమార్-వాస్కోడగామా మధ్యన నడిచే అమరావతి ఎక్స్‌ప్రెస్ (నం. 18047) రైలును ఈ నెల 16 ఏప్రిల్ 15వ తేదీ వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 18048)ను ఈ నెల 19 నుంచి ఏప్రిల్ 18వ తేదీ వరకూ వాస్కోడగామా-హుబ్లీ సెక్షన్‌లో పాక్షికంగా రద్దుపరచి హుబ్లీ-షాలిమార్ సెక్షన్‌లో నడపనున్నట్టు తెలియజేశారు. అలాగే తిరుపతి-హైదరాబాద్, హైదరాబాద్-వాస్కో వెళ్లే (నం. 17419, 17019) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకూ వాస్కో వరకూ కాకుండా కేవలం హుబ్లీ వరకు మాత్రమే నడపనున్నట్టు వివరించారు. అలాగే వీటి తిరుగు ప్రయాణపు రైళ్లను (నం. 17420, 17022) ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకూ హుబ్లీ-వాస్కో సెక్షన్‌లో పాక్షికంగా రద్దు పరిచామన్నారు. సికింద్రాబాద్-వాస్కోడగామా బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 17 నుంచి ఏప్రిల్ 16 వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17040) ఈనెల 18 నుంచి ఏప్రిల్ 17వ తేదీ వరకూ హుబ్లీ-వాస్కో సెక్షన్‌లో పాక్షికంగా రద్దుచేశారు.

రైళ్ల ఆలస్యం



గుంతకల్లు, జనవరి7(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో జరుగుతున్న మెయింటెనెన్స్ పనుల కారణంగా కాచిగూడ-గుంతకల్లు (నం. 57412), గుంతకల్లు-బోధన్ (నం. 57411) రైళ్లను ఈ నెల 20, 27 తేదీల్లో ఆలస్యంగా నడపనున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. కాచిగూడ-గుంతకల్లు రైలును మూడున్నర గంటలు, గుంతకల్లు-బోధన్ రైలును 3 గంటల ఆలస్యంగా నడపనున్నట్టు తెలియజేశారు.



చిరంజీవితో భవానీ రవికుమార్

చిరంజీవిని కలిసిన భవానీ రవికుమార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సినీ హీరో మెగాస్టార్ చిరంజీవిని, చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు భవానీ రవికుమార్ కలిశారు. హైదరాబాదులోని చిరంజీవి స్వగృహంలో మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవి తనను గుర్తుపట్టి, ఆప్యాయంగా పలుకరిస్తూ ఆలింగనం చేసుకోవడంతో భావోద్వేగానికి గురైనట్లు భవానీ తెలిపారు. మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన తనను ఆశీర్వదించడం తన జీవితంలో మరిచిపోలేనన్నారు.

చాముండేశ్వరికి రాష్ట్ర పదవి

అనంతపురం టౌన్, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఏపీ హంస స్టేట్‌జాయింట్ జనరల్ సెక్రెటరీగా స్టాఫ్‌నర్సు చాముండేశ్వరి నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్ ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. చాముండేశ్వరి ప్రస్తుతం అనంత సర్వజన ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పని చేస్తున్నారు. తనకు రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు అప్పగించడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్ బాక్స్

టమోటా కిలో రూ. 10



అనంతపురం రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 8, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 23వేలు

అనంతపురం రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 23,100 పలికినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 7,200, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 13 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఇన్‌ఫ్లో 684 క్యూసెక్కులు

బెళుగుప్ప, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 684 క్యూసెక్కులు ఉన్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 442 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో నీటి నిల్వ 1.681 టీఎంసీలు వుందని అధికారులు వెల్లడించారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు మంగళవారం ఘర్షణకు దిగారు. విద్యార్థులు తెలిపిన మేరకు పట్టణంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్, సెకెండ్ ఇయర్ విద్యార్థులు ఒకరికొకరు వాదులాడుకున్నారు. ఈ నేపథ్యంలో ఫస్ట్ ఇయర్ విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని తమ మిత్రులకు ఈ గొడవపై సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి ఘర్షణకు దిగారు. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వర్దన్ అనే విద్యార్థి గాయపడ్డాడు. అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంతలోనే పట్టణ పోలీసులు జోక్యం చేసుకుని రెండు కళాశాలల విద్యార్థులను పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు కళాశాలల ప్రిన్సిపాళ్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

పట్ట పగలే ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ



ఇంట్లో వస్తువులను పరిశీలిస్తున్న సీఐ

గుత్తి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీలో మంగళవారం పట్ట పగలే ఉపాధ్యాయుడు రాజేష్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు, రూ. లక్ష అపహరించినట్లు రాజేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటికి తాళాలు వేసి ఆయన, ఆయన భార్య విధులకు వెళ్లారు. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. సీఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా మారుద్దాం

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ మంజుల



రికార్డులను పరిశీలిస్తున్న డైరెక్టర్ మంజుల

బత్తలపల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఏపీని ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా మారుద్దామని ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ మంజుల తెలిపారు. మండల కేంద్రంలో ఆర్డీటీ నిర్వహిస్తున్న ఏఆర్‌టీ ఆస్పత్రిని ఆమె మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హెచ్ఐవీ పీడితులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. హెచ్ఐవీ పీడితులకు బీపీ, సుగర్, క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించాలని వైద్యులకు సూచించారు. అనంతరం రెండు జిల్లాల వైద్య శాఖ, ఏఆర్‌టీ అధికారులు, స్వచ్ఛంద సంస్థ పతినిధులతో ఆమె సమీక్ష నిర్వహించారు.

తేజ ప్రసాద్ మృతి తీరని లోటు

నివాళులు అర్పించిన ప్రముఖులు

జోహార్లు అర్పిస్తూ జర్నలిస్టుల కడపటి వీడ్కోలు

అనంత వైద్యకళాశాలకు పార్థివ దేహం అప్పగింత



తేజ ప్రసాద్ అంతిమయాత్రలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు



కాలవ శ్రీనివాసులు



పూలమాల వేస్తున్న పరిటాల సునీత, శ్రీరామ్



జగదీష్, వేమయ్య యాదవ్



సీపీఐ జాఫర్



విశ్వేశ్వరరెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో విశిష్ట సేవలందించిన తేజ ప్రసాద్ మృతి తీరని లోటు అని పలువురు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ప్రెస్‌క్లబ్‌లో తేజ ప్రసాద్ భౌతిక కాయానికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తదితర నాయకులు, జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉమ్మడి జిల్లా జర్నలిస్టులు ఆయన పార్థివదేహాన్ని ప్రెస్‌క్లబ్ నుంచి ర్యాలీగా తీసుకువెళ్లి మెడికల్ కళాశాలకు అందజేశారు. జర్నలిస్టులు తేజ ప్రసాద్ జోహార్లు అర్పించారు. తన మరణానంతరం వైద్య విద్యార్థులకు తన శరీరం ఉపయోగపడాలన్న తేజ ప్రసాద్ ఆలోచన ఆచరణీయమని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాల రావు అన్నారు. ఆయన మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

ప్రముఖుల సంతాపం

సీనియర్ జర్నలిస్టు తేజ ప్రసాద్ మృతికి సీపీఎం సంతాపం వ్యక్తం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వామపక్ష ఉద్యమానికి, సీపీఎంకు ప్రసాద్ ఎంతో అండగా నిలిచారని గుర్తు చేసుకున్నా రు. వ్యక్తిగతంగా నూ తనతో ఎంతో ఆప్యాయంగా ఉండేవారని, అనేక సలహాలు, సూచనలు ఇచ్చే ప్రసాద్‌ను కోల్పోవడం బాధగా ఉందని పేర్కొన్నారు. సీపీఎం నగర కార్యదర్శి వి. రామిరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, నాయకులు ప్రకాష్, శేషయ్య, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి సోదరుడు సుందర్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, ఎరువుల డీలర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతా వెంకటేశ్వర్లు, కోశాధికారి రమేష్ తదితరులు తేజా ప్రసాద్‌కు నివాళులు అర్పించారు.

తూకాల్లో మోసం..పసిగట్టిన రైతులు

జరిమానా చెల్లించి బయటపడ్డ వ్యాపారి

విడపనకల్లు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంది రైతులను ఓ వ్యాపారి మోసగించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ వ్యాపారి రెండు రోజుల కిందట వి. కొత్తకోట గ్రామంలోని రైతుల వద్ద కందులు కొనుగోలు చేశాడు. వాటిని ఎలక్ర్టానిక్ కాటాలో తూకాలు వేశాడు. ఒక్కో బ్యాగులో 50 కిలోలు తీసుకోవాల్సి ఉండగా బాదు పేరుతో అదనంగా రెండు కిలోలు తూచాడు. ఇలా తూచిన కందుల బస్తాలను వరుస క్రమంలో పక్కన పెట్టుకుంటూ వచ్చాడు. కందుల బస్తాలను చూస్తున్న రైతులకు ఇవి 52కేజీల కంటే ఎక్కువ ఉన్నాయని అనుమానం వచ్చింది. వెంటనే వేరే తూనికను తెప్పించి సంచులను తూకం వేయించారు. దీంతో ఒక్కో బస్తా బరువు 60నుంచి 62 కిలోలు వచ్చింది. దీంతో ఆగ్రహించిన రైతులు వ్యాపారిపై దాడికి దిగారు. అనంతరం లారీని, వ్యాపారిని పోలీసులకు అప్పగించేందుకు యత్నించారు. అయితే మధ్యవర్తులు కలుగజేసుకుని రైతులతో చర్చించారు. కందులు అమ్మిన ప్రతి రైతుకు రూ.లక్ష అదనంగా(జరిమానా) ఇప్పించేలా ఒప్పందం కుదిర్చారు. ఆమేరకు వ్యాపారి డబ్బు వెంటనే చెల్లించి, కేసు లేకుండా తప్పించుకున్నాడని రైతులు తెలిపారు.

15 రోజుల కిందట చాబాలలోను ఇదే తంతూ...

గత 15 రోజుల కిందట వజ్రకరూరు మండలంలోని చాబాల గ్రామంలో కందులను కొనుగోలు చేసిన వ్యాపారి ఎలక్ర్టానిక్ కాటాతో(తూనిక)తో ఒక్కొక్క బస్తాకు 8 నుంచి 10 కేజీలు అదనంగా తూకాలు వేసి లారీకి లోడ్ చేశాడు. అనుమానం వచ్చిన రైతులు తూకాలు చేసిన ఆ బస్తాలను కిందకు దించి వేరే ఎలక్ర్టానిక్ కాటాలో వేసి చూడగా మోసం బయటపడింది. దీనిపై గ్రామస్థులు వజ్రకరూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తూనికలు కొలతలు అధికారులు చాబాల గ్రామం చేరుకుని ఎలక్ర్టానిక్ తూనిక కింది భాగంలో ఓపెన్ చేసి చూడగా 10 కేజీలు ఎక్కువ తీసుకునేలా సెట్ చేసి పెట్టినట్లు నిర్ధారించారు. దీంతో వ్యాపారులపై కేసు నమోదు చేశారు. వ్యాపారుల మోసాలపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రథయాత్రను జయప్రదం చేయండి

ఏబీఎస్ఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని బంజార భవన్ నుంచి నాయక్‌నగర్ వరకు ఈనెల 26న నిర్వహించనున్న శాంతి సద్భావన యాత్రను జయప్రదం చేయాలని అఖిల భారత బంజారా సేవా సంఘ్(ఏబీఎస్ఎస్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలాజి నాయక్, బాబునాయక్ పిలుపునిచ్చారు. ఏబీఎస్ఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం శాంతి సద్భావన యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ప్రతిఏటా ఫిబ్రవరి 13, 14, 15వ తేదీల్లో సేవాఘడ్‌లో సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఉత్సవాల సూచికగా జనవరి 26న జిల్లా కేంద్రంలో శాంతి సద్భావన యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 26న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కేంద్రంలోని రెండో రోడ్డులోని బంజారా భవన్ నుంచి శాంతి సద్భావన యాత్ర మొదలై క్లాక్‌టవర్, సప్తగిరి సర్కిల్, విద్యుత్‌నగర్ సర్కిల్ మీదుగా నాయక్‌నగర్‌లోని మారెమ్మ దేవాలయ సందర్శనా నంతరం నాయక్‌నగర్‌కు చేరుకోవడంతో ముగుస్తుందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని బంజారాలంతా పెద్దసంఖ్యలో పాల్గొని శాంతి సద్భావన యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగ్లానాయక్, డాక్టర్ రమణ నాయక్, సేవామాల గురురాజేంద్ర ప్రసాద్, మహిళావిభాగం జిల్లా కార్యదర్శి శివమణిబాయి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, విజయలక్ష్మిబాయి తదితరులు పాల్గొన్నారు.

రాగి సాగు చేయండి

రైతులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

మద్దతు ధరతో కొనుగోలుకు నిర్ణయం

క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు



రాగిపంట (ఫైల్)

ధర్మవరం రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి):రాగి మంచి పోషకాలు కలిగిన సంప్రదాయ పంట. గతంలో రాగి పంటకు భలే డిమాండ్ ఉండేది. రాగి ముద్ద లేనిదే ముద్ద నోట్లోకి దిగేది కాదని ఆయా గ్రామస్థులు చెబుతారు.రాగుల కోసం రైతులు రబీలో ముందస్తుగా పంటను సాగుచేసుకునేవారు. రాగి పంట ప్రతికూల, బెట్ట పరిస్థితులను తట్టుకుని దిగుబడి ఇస్తుంది. మెట్టసాగుకు అనుకూలంగా ఉంటుంది. రాగి గింజలకు నిల్వపురుగులను తట్టుకునే అధిక శక్తి ఉంటుంది. రానురాను పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో సాగు తగ్గుముఖం పట్టింది. కొన్నేళ్లుగా రాగులకు డిమాండ్ పెరిగింది. దీంతో ప్రభుత్వమే పంట సాగును పెంచేందుకు చర్యలు చేపట్టింది. మద్దతు ధర ప్రకటించి, పంట దిగుబడిని ప్రభుత్వమే కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. గ్రామాల్లో రాగిపంట సాగు పెంచేందుకు వ్యవసాయాధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

క్వింటానికి రూ.4,290..

రాగి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. రాగి సాగును పెంచాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇప్పటికే వ్యవసాయాధికారుల ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ప్రస్తుతం మద్దతు ధర క్వింటాకి రూ.4290గా నిర్ణయించింది. ఈ నెలలో పంట సాగుచేసుకుంటే వేసవిలో దిగుబడి వస్తుందని అధికారులు తెలుపుతున్నారు.

తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి..

రాగి పంటకు తక్కువ పెట్టుబడులు పెట్టి అధిక దిగుబడులు సాధించవచ్చు. పెద్దగా మందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదు. పశువుల పేడ, కాంప్లెక్స్ ఎరువులు వేయాలి. మిగతా పంటలతో పోల్చుకుంటే రాగికి చాలా తక్కువ పెట్టుబడులు అవసరం.

ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోంది



రాగి సాగు విస్తీర్ణం పెంచాలని ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోంది. క్వింటా రూ.4290తో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. ప్రస్తుతం రాగి సాగుచేసే రైతులు తప్పనిసరిగా క్రాప్‌బుకింగ్ చేయించుకోవాలి. తద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సులువవుతుంది. రాగి సాగు చేసేలా ఇప్పటికే రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. రైతులు బోరుబావుల కింద పంట పెట్టుకోవాలి.

- కృష్ణయ్య, ఏడీఏ, ధర్మవరం

మట్కాక్ష్ అయ్యేనా..?

పోలీసులది ఆరంభశూరత్వమేనా..?

రెండు రోజుల్లో రూ.లక్ష పట్టివేత

మట్కాపై దాడులు కొనసాగేనా



తాడిపత్రి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పోలీసులు మట్కాపై ఉక్కుపాదం మోపుతారా లేక ఏదో పేపర్లలో వచ్చింది కదా అని కొన్ని రోజులు హడావుడి చేసి వదిలేస్తారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. రెండురోజుల కిందట 'ఆంధ్రజ్యోతి'లో విస్తరిస్తున్న మట్కా శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. దీంతో వరుసగా రెండురోజులపాటు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి 9:45గంటల సమయంలో పట్టణంలోని గాంధీకట్ట వద్ద దాడులు నిర్వహించి రూ.70వేలు సీజ్‌చేశారు. మంగళవారం నంద్యాలరోడ్డులో మట్కాబీటర్‌ను అరెస్ట్‌చేసి రూ.30వేలు సీజ్‌చేశారు. రెండురోజుల వ్యవధిలోనే లక్ష రూపాయలు సీజ్‌చేశారు. దీంతో మట్కాను ఇన్నిరోజులు పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దాడులు గతంలోనే చేసి ఉండి ఉంటే మట్కా ఈ స్థాయిలో విస్తరించేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇతర జిల్లాల నుంచి వచ్చి..

నెల్లూరు, చిత్తూరు, ప్రొద్దుటూరు, నంద్యాల ప్రాంతాల నుంచి సైతం మట్కాబీటర్లు తాడిపత్రికి వచ్చి మట్కా రాస్తున్నారంటే ఇక్కడ ఏ స్థాయిలో మట్కా జరుగుతోందో అర్థమవుతుంది. నంద్యాలరోడ్డులో మంగళవారం జరిపిన దాడుల్లో పట్టుబడిన మట్కాబీటర్ జయరామిరెడ్డి స్వస్థలం నెల్లూరు జిల్లా అని తెలుస్తోంది. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వీరు వారంలో నాలుగురోజులపాటు తాడిపత్రిలో మకాం వేసి మట్కాను పకడ్బందీగా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరు పట్టణంలోని మురికివాడల్లో నివసిస్తున్న పేదలను టార్గెట్ చేస్తూ కేంద్రాలను నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. ఇలా పట్టణంలో మట్కాను పక్కా ప్రణాళికతో నిర్వహిస్తున్న బీటర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతారో లేదో వేచిచూడాల్సిందే.

కదిరి సంతలో నకిలీ నోట్లు

రైతును మోసగించిన యువకులు



నకిలీ నోట్లను చూపిస్తున్న బాధిత రైతు నగేష్

కదిరి అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కదిరి వ్యవసాయ మార్కెట్ యార్డు గొర్రెల సంతలో నకిలీ నోట్లు కలకలం రేపాయి. ముదిగుబ్బకు చెందిన రైతు నగేష్ మంగళవారం రెండు పొట్టేళ్లను సంతకు తెచ్చి విక్రయించారు. ఇద్దరు యువకులు పొట్టేళ్లను బేరమాడి, రూ.32 వేలకు కొనుగోలు చేశారు. ఆ మొత్తానికి రూ.500 నోట్లు ఇచ్చి.. పొట్టేళ్లను తీసుకెళ్లారు. కాసేపటి తరువాత అనుమానం వచ్చిన రైతు.. పక్క రైతులకు చూపించగా, అవి నకిలీ నోట్లు అని తేలింది. దీంతో రైతు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ విషయాన్ని వెంటనే మార్కెట్ యార్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నీరంజన్‌రెడ్డి సిబ్బందితో మార్కెట్ యార్డుకు వెళ్లి విచారించారు. రైతు నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేశారు. ప్రజలు నకిలీ నోట్లపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎగతాళి చేశారని విద్యార్థి ఆత్మహత్యాయత్నం



విద్యార్థిని విచారిస్తున్న ఎస్ఐ రాంప్రసాద్

అనంతపురంరూరల్/క్రైం, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఎగతాళి చేశారన్న బాధతో ఓ విద్యార్థి మంగళవారం ఆత్మహత్యకు యత్నించాడు. విద్యార్థి తల్లి , కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు సోమనాథ్‌నగర్‌కు చెందిన విద్యార్థి తపోవనంలోని జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకుంటున్నాడు. అదే క్లాస్‌లో తనతో పాటు చదువుకుంటున్న తన సమీప బంధువుల కుర్రాడితో సోమవారం గొడవపడ్డాడు. ఈ విషయం ఉపాధ్యాయుల దృష్టికి వెళ్లగా మ్యాథ్స్ టీచర్ సురేష్ బాధితుడినే మందలించి రెండు దెబ్బలు వేశాడు. మరుసటి రోజు మంగళవారం స్టడీ అవర్స్‌లో ఇంగ్లిష్ టీచర్ సరళ కూడా బాధిత బాలుడిని హేళనగా మాట్లాడారట. తర్వాత ఇదే విషయంలో తోటి విద్యార్థులు హేళన చేస్తూ మాట్లాడారట. ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పినా పట్టించుకోకపోవడం, ఫిర్యాదు చేసిన తననే మందలించడంతో ఆ బాలుడు తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే మధ్యాహ్న సమయంలో పాఠశాలలోని బాత్రూంలోకి వెళ్లి ఫినాయిల్ తాగాడు. గమనించిన ఉపాధ్యాయులు బాలుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. విద్యార్థికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు చెప్పడంతో విద్యార్థి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న నాలుగో పట్టణ ఎస్ఐ రాంప్రసాద్ ఆస్పత్రికి వెళ్లి విద్యార్థిని విచారించారు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యం.. కేసుల నమోదు

గుంతకల్లుటౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోదీనాబాద్ కాలనీలో నివాసముంటున్న ఉరుకుందమ్మ, దిలీప్ దంపతుల కుమారుడు బెలగల రాహుల్, అతడి స్నేహితుడు పరుశురాముడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ మంగళవారం తెలిపారు. రాహుల్ 8వ తరగతి చవుతున్నాడు. స్కూల్‌కు సరిగా వెళ్లడం లేదని అతడి తల్లి మందలించిందన్నారు. దీంతో ఉదయం రాహుల్ స్కూల్‌కు వెళ్తున్నాని ఇంట్లో చెప్పి అదే కాలనీకి చెందిన అతడి స్నేహితుడు పరుశురాముడుతో కలిసి వెళ్లాడన్నారు. సాయంత్రమైనా వారు ఇంటికి రాకపోవడంతో వారి కుటుంబసభ్యులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఇద్దరు అబ్బాయిలు ఆచూకీ తెలిస్తే సెల్: 9440796821 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

- మోమినాబాద్‌కు చెందిన ఖాజాభాను అనే మహిళా అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పదేళ్ల కుమార్తెను తీసుకుని ఇంటినుంచి సోమవారం వెళ్లిపోయిందని భర్త షేక్ ఇబ్రహీం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం,జనవరి7(ఆంధ్రజ్యోతి): నగరంలోని వేణుగోపాల్‌నగర్‌కు చెందిన రామాంజనేయులు భార్య పుష్పావతి(32) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రామాంజనేయులు పెయింటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే క్రమంలో అతను మద్యానికి బానిసయ్యాడు. తాగుడు అలవాటు మానుకోవాలని భార్య, కుటుంబసభ్యులు తరచూ చెప్పేవారు. ఈ విషయంలో దంపతుల మధ్య తరచూ గొడవ కూడా జరిగేది. ఈక్రమంలోనే మంగళవారం మరోసారి భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన పుష్పావతి మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత...

నగరంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియాన్ని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రాణినగర్‌కు చెందిన షేక్ దూద్‌పీర్ ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా గుత్తిరోడ్డులో పోలీసుల తనిఖీలో ఆటో పట్టుబడింది. దూద్‌పీర్‌ను అరెస్ట్ చేసి ఆటోలో ఉన్న 19 బస్తాల పీడీఎస్ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు.



బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA- 224879

గాయత్రి జ్యోతిష్యం

పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర: 9440532926

AJA-224944

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

నాథుడు లేని నగరపాలిక


నగరపాలిక కార్యాలయం


ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ (ఫైల్)

- దీర్ఘకాలిక సెలవులో ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్
- ఎన్‌క్యాప్ నిధుల నత్తనడకపై కలెక్టర్ సీరియస్
- నలుగురు ఉన్నతాధికారుల సీట్లు ఖాళీ

అనంతపురం క్రైం, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : నగరపాలికకు పాలన భయం పట్టుకుంది. కలెక్టర్ వినోద్‌కుమార్ నగర ఇన్‌చార్జ్ కమిషనర్, అధికారులపై అక్షింతలు వేశారు. దీంతో ఈ నెల 16 నుంచి సెలవుపై వెళ్లాలనుకున్న నగర కమిషనర్ రామలింగేశ్వర్ మంగళవారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు 27రోజుల పాటు సెలవులో వెళ్లారు. దీంతో నగరపాలికను నడిపించే ఉన్నతాధికారే కరువయ్యారు. పాలిక అధికారిగా ఎవరు ఎప్పుడొస్తారో...? ఎన్నిరోజులు ఉంటారో తెలి యని పరిస్థితి. అభివృద్ధి మాట దేవుడెరుగు.. కనీస సమస్యలు పరిష్క రించలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. రెగ్యులర్ కమిషనర్ నాగరాజు డిసెంబరు 15న దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లారు. మూడు వారాలకే ఇన్ చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ సెలవులోకి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

కలెక్టర్ అక్షింతలు

ఎన్‌క్యాప్ నిధులకు సంబంధించి కలెక్టర్ వినోద్‌కుమార్ సమీక్ష నిర్వహిస్తుండటంతో సోమవారం సాయంత్రం నగర ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లారు. ఎన్‌క్యాప్ నిధులకు సంబంధించి దాదాపు రూ.4కోట్ల వరకు ఖర్చు పెట్టకుండా, ఎందుకింత నిర్లక్ష్యం.. అంటూ కలెక్టర్ మండిపడ్డారు. ఇక శానిటేషన్ అధ్వానంగా ఉందని, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి అక్రమ కట్టడాలపై తరచూ ఫిర్యాదులు అందుతున్నాయని సీరియస్ అయ్యారు. అంతే కొంతసేపటికే కమిషనర్ సెలవులోకి వెళ్తున్నట్లు లీవ్ లెటర్‌న నగరపాలిక కార్యాలయానికి పంపారు. ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకునేందుకు నగర డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు అయిష్టంగా ఉన్నట్లు తెలిసింది.

నలుగురు ఉన్నతాధికారుల సీట్లు ఖాళీ

నగరపాలికలో ఏకంగా నలుగురు ఉన్నతాధికారుల సీట్లు ఖాళీగా ఉన్నాయి. కమిషనర్‌గా ఉన్న నాగరాజు గత నెల15న సెలవులోకి వెళ్లారు. ఇప్పుడు ఇన్‌చార్జ్ కమిషనర్(అడిషనల్ కమిషనర్)గా ఉన్న రామలింగేశ్వర్ సెలవులోకి వెళ్లిపోయారు. మూడు నెలలుగా సెక్రటరీ పోస్టు ఖాళీగానే ఉంది. కీలకమైన టౌన్‌ప్లానింగ్ అధికారి అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) శ్రీనివాసులు నెలరోజుల పాటు సెలవు పెట్టడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఇక మేనేజర్ సతీష్‌కు శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నగర పంచాయతీ కమిషనర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయన రేపో, మాపో అక్కడికి వెళ్లనున్నారు. ఏడాదిన్నరగా సర్వేయర్ పోస్టు ఖాళీ ఉంది. ఇప్పుడొచ్చే అధికారి ఇన్ని కీలక ఖాళీలతో ఎలా నడిపిస్తారోనని కార్పొరేషన్ వర్గాలు గుసగుసలాడుతున్నారు.

ఎమ్మెల్యేకి సవాల్..?

నగరపాలికలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు సవాల్ విసురుతున్నాయి. ఆయన వచ్చినప్పటి నుంచి ముగ్గురు కమిషనర్లు మారారు. తొలుత ఉన్న ఐఏఎస్ అధికారి మేఘస్వరూప్ బదిలీపై వెళ్లగా, ఇన్‌చార్జ్‌లుగా ఉన్న నాగరాజు, రామలింగేశ్వర్ నెలన్నర రోజుల వ్యవధిలో దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లా రు. కొంతకాలంగా నగరపాలికలో పరిస్థితులు దుర్భరంగా మారాయి. మున్సిపాలిటీలా తయారైందని కార్పొరేషన్ ఉద్యోగులే అంటున్నారు. పా రిశుధ్యం, టౌన్‌ప్లానింగ్ విషయంలో ప్రజల నుంచి బహిరంగ విమర్శ లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో నగరాన్ని అభివృద్ధి దిశగా నడిపించే అధి కా రిని రప్పించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించండి

- విద్యాశాఖాధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన


విద్యాశాఖాధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రతి పాఠశాలలో తప్పని సరిగా మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఆమె మంగళవారం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులు, అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్, సమగ్ర శిక్ష, సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ అధికారులు, నియోజకవర్గంలోని ఆరు మండలాల విద్యా శాఖ అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గంలోని పాఠశాలలు, జూనియర్ కళాశాల్లో ప్రస్తుత పరిస్థితులు, సమస్యలపై చర్చించారు. విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల కొరత తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ.... విద్యార్థులకు అనుగుణంగా ప్రతి పాఠశాలలో మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు ఉండేలా చూడాలన్నారు. పరిశుభ్రతపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందించాలన్నారు. విద్యా శాఖ మంత్రి నారాలోకేశ్ సూచనల మేరకు పాఠశాలలను రాజకీయాలకు దూరంగా ఉంచాలన్నారు. మండల విద్యా శాఖాధికారు కార్యాలయాల మరమ్మతుల కోసం అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. కనగానపల్లి కేజీబీవీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్య పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేప థ్యంలో ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించండి : జేడీ

అనంతపురం అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ స్థాయి ల్యాబ్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి సూచించారు. స్థానిక పశువ్యాధి నిర్ధారణ కేంద్రంలో ల్యాబ్‌సిబ్బందికి మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పశుసంవర్ధక శాఖ జేడీ మాట్లాడుతూ... బ్రూసెల్లోసిస్, ఇతర రకాల వ్యాధులపై రక్తన మూనాలు సేకరించి ల్యాబ్‌లలో ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలన్నారు. పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రామచంద్ర, ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా యాప్‌లో నమోదు చేయండి : డీఎస్‌డీఓ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): క్రీడాశాఖలో జరుగుతున్న కార్యక లాపాలన్నీ క్రీడాయాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ తెలిపారు. స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో క్రీడాభివృద్ధి, ఆన్‌లైన్ క్రీడాయాప్‌పై డీఎస్‌డీఓ మంగళవారం కోచ్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 12.5 లక్షలు నిధులు మంజూరు చేసిందని, అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆఫీస్ ఏఓ దేవమణి, కోచ్‌లు అనీల్‌కుమార్, నరేష్‌కుమార్, సంధ్య, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించాలి

- అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

గార్లదిన్నె, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు సంబంధి ప్రతి సమస్యకు సత్వర పరిష్కారం చూపాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పేర్కొన్నారు. మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదుస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న హాజరయ్యారు. పలువురు రైతులు భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. భూ సమస్యలను పరిష్కరించాలని రాయలసీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ తహసీల్దార్ బండారు ఈరమ్మకు వినతిపత్రాన్ని సమర్పించారు. టీడీపీ నాయకులు అవులక్రిష్ణయ్య, సర్వేయర్ శ్యామల, ఆర్‌ఐ హేమలత, వీఆర్వోలు అంజినేయులు, శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు, నాయకులు గోరకాటి వెంకటేష్, రాము పాల్గొన్నారు.

సీమలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య

అనంతపురం విద్య, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మల్లికార్జున, సీపీఐ నేతలతో కలిసి ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఢిల్లీ కేంద్రంగా సాగుతున్న రైతుల ఉద్యమానికి తమ సంఘం తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఆలస్యం చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఆత్మహత్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, వ్యవసాయ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన దేహదారుఢ్య పరీక్షలు

అనంతపురం క్రైం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని నీలం సంజీవరెడ్డి మైదానంలో పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ఏడో రోజూ మంగళవారం కొనసాగాయి. ఎస్పీ జగదీష్ దగ్గరుండి సీసీ కెమెరాల పర్యవేక్షణలో కొనసాగేలా చర్యలు చేపట్టారు. ఏపీ పోలీస్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు(ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ) నిబంధనల మేరకు అనుగుణంగా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ నెల 16వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారమే దేహదారుఢ్య పరీక్షలు జరుగుతాయన్నారు. 8, 9, 10తేదీల్లో జరగాల్సిన దేహదారుఢ్య పరీక్షలు ఈ నెల 17, 18, 20 తేదీలలో నిర్వహిస్తామన్నారు. అప్పీలు అభ్యర్థులు ఈనెల 21న హాజరు కావాలన్నారు.

అంచనాలను సిద్ధం చేయండి

అనంతపురం క్రైం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సమస్యల పరిష్కారానికి నగరంలో అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని నగర మేయర్ మహమ్మద్ వసీం అధికారులను ఆదేశించారు. మంగళవారం మేయర్ వసీం నగరంలోని 43, 46వ డివిజన్ల పరిధిలో డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్యతో కలిసి పర్యటించారు. డ్రైనేజీల ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేసి టెండర్లు పిలవాలని ఆదేశించారు. ఈఈ రాధాకృష్ణ, డీఈ నరసింహులు, కార్పొరేటర్లు ఇషాక్, రాజేశ్వరి, సైఫుల్లాబేగ్, అబూసాలెహా పాల్గొన్నారు.

ప్రధానికి ఆంధ్రాకు వచ్చే హక్కు లేదు : సీపీఎం

అనంతపురం కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రధానికి మోదీకి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించే హక్కు లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం విశాఖపట్నం పర్యటనను నిరసిస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్రకుమార్, బాలరంగయ్య, సావిత్రమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రామాంజినేయులు, వెంకటనారాయణ, పరమేష్, నాగరాజు, ముత్తుజా, నగర కమిటీ సభ్యులు ప్రకాష్‌రెడ్డి, వలి, ఇర్ఫాన్, ఆటో శీనా, ఓబులేసు, చెన్నారెడ్డి, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆర్ఐఓ వెంకటరమణపై చర్యలు తీసుకోవాలి'

అనంతపురం విద్య, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ కళాశాల విషయంలో ఉదాసీనత వహిస్తున్న ఆర్ఐఓ వెంకట రమణపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎడీఎస్‌యూ, పీడీఎస్ఓ, ఏఐఎస్‌ఏ, ఆర్‌వీపీ సంఘాల నాయకులు మంగళవారం స్థానిక క్లాక్‌టవర్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నిత్యం కాలేజీల్లో ఒత్తిడి వల్ల విద్యార్థులు ఆత్మహత్యాయత్నాలు చేస్తున్నా, అధికారుల్లో ఎలాంటి చలనం రావడం లేదన్నారు.ముఖ్యంగా ఆర్ఐఓ కొందరికి తొత్తుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నాయకులు వెంకటేష్, బాలకృష్ణ, సంజీవ్‌రాజు, అష్రఫ్ వలి, సంతప్,శశి తదితరులు పాల్గొన్నారు.

సెరికల్చర్ కార్యాలయంలో చెట్ల నరికివేత

అనంతపురం సెంట్రల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలోని చెట్లను మంగళవారం కొట్టివేశారు. అయితే కార్యాలయ పర్యవేక్షకులు, జిల్లా అధికారికి తెలియకుండా కొట్టివేయడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. దాదాపు పదెకరాల విస్తీర్ణమున్న పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలో రీలింగ్ యూనిట్, సంచార రైతు శిక్షణ సాంకేతిక సేవ, పట్టుపరుగుల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. అదేవిధంగా ఐదెకరాల విస్తీర్ణంలో మల్బరీ మొక్కలు పెంచి పట్టు రైతులకు పంపిణీ చేస్తున్నారు. దశాబ్దాల వయసు ఉన్న వందలాది చెట్లున్నాయి. ప్రస్తుతం ఇక్కడ మల్బరీ మొక్కలు పెంచే ప్రక్రియ మాత్రమే కొనసాగుతోంది. మిగిలిన కేంద్రాలు వినియోగంలో లేకపోవడంతో మూతపడ్డాయి. వాటి ఆవరణలో చెట్లు ఏపుగా పెరిగాయి. కార్యాలయంలోని ప్రతి చెట్టును జిల్లా అటవీ శాఖ గణాంకాల్లో చేర్చి, నంబర్లను కేటాయించి గుర్తులు వేశారు. కార్యాలయంలోని ఏ చెట్టును కొట్టాలన్నా అనుమతి తీసుకోవాలి. కానీ ఎవరి అనుమతి లేనిదే పలు చెట్లను కొట్టివేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారి అంజనేయులు మాట్లాడుతూ... తనకు తెలియకుండా చెట్లను కొట్టివేశారని తెలిపారా. రీలింగ్, ట్విస్టింగ్ యూనిట్ల షెడ్ల రేకులపై పడుతున్నందున కొట్టివేసినట్లు సిబ్బంది చెప్పారని ఆయన పేర్కొన్నారు. ఏ ఉద్దేశంతో కొట్టివేశారో సమాధానం చెప్పాలని బాధ్యులకు మెమో జారీచేస్తామన్నారు. కట్టెలు, మొద్దులను విక్రయించమని తెలిపారు.


చెట్లను కొట్టివేసిన దృశ్యం


కుప్పలుగా వేసిన కట్టెలు, మొద్దులు

న్యూస్ బాక్స్

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రముఖ నిర్మాణసంస్థ కల్పతరు కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... పాలిటెక్నిక్ చివరి సంవత్సరంలోనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అనంతపురం, తాడిపత్రి, రాయదుర్గం, కళ్యాణదుర్గం, హిందూపురం ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఒకే వేదికగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను ఏర్పాటుచేశామన్నారు. 92మంది సివిల్, మెకానికల్, ఎలెక్ట్రికల్ విద్యార్థులు పాల్గొనగా 64మంది ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి దినేష్ బృందంతోపాటు కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, హెచ్‌ఓడీ ధీరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం

ఆత్మకూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్రెల ఉత్పత్తిదారుల స్థానిక సొసైటీల ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవమయ్యాయి. కమిటీకి టీడీపీ వర్గీయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రంగంపేట గొర్రెల సొసైటీ అధ్యక్షుడిగా అహోబిలం, ఉపాధ్యక్షుడిగా నల్లప్ప, ఐదుగురు సభ్యులను ఎనుకున్నారు. ఈ.సీతారాంపురం సొసైటీ అధ్యక్షుడిగా పిల్లల శివన్న, ఉపాధ్యక్షుడిగా మూడిండ్ల పెద్దన్నతో పాటు ఐదుగురు సభ్యులు ఎన్నికయ్యారు. దీంతో టీడీపీ మద్దతుదారులు సంబరాలు చేసుకున్నారు. ఈ. సీతారాంపురం సంఘానికి 15 సంవత్సరాలు తరువాత టీడీపీ వర్గీయులు ఎన్నిక కావడంతో వారు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ శ్రీదేవి, టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి, నాయకులు శ్రీనివాసులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం రూరల్: మండలంలోని పూలకుంట గ్రామం అక్కమ్మగార్ల ప్రాథమిక గొర్రెల ఉత్పత్తిదారుల సహకార సంఘం పాలక వర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో అధ్యక్షుడిగా చినగొండ ఆదినారాయణ, ఉపాధ్యాక్షుడిగా చిట్రా గుర్రప్ప, డైరెక్టర్లుగా యల్లప్ప, నారాయణస్వామి, వరికూటి దేవేంద్ర, అక్కులప్ప, శేషన్న ఎన్నికయ్యారు. మండల వ్యాప్తంగా ఐదు సంఘాలుండగా మొదటి విడతలో మంగళవారం పూలకుంట సంఘం ఎన్నిక పూర్తయింది. కాటిగాని కాలువ సంఘం ఎన్నికవాయిదా పడింది. టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగేమురళి, నాయకులు నారాయణస్వామి, బాలరాజు, సూరి, అజయ్‌కుమార్‌రెడ్డి, వన్నారెడ్డి, సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, శివయ్య, ఓబిలేసు, మల్లయ్య, శంకర్‌రెడ్డి, మల్లయ్య, తిరుపాలు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

రాప్తాడు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో పాఠకులకు పుస్తకాలు అందుబాటులో ఉండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. రమ తెలిపారు. ఆమె మంగళవారం రాప్తాడు గ్రంథాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంకు వెళ్లి గ్రంథాలయ పన్ను బకాయిలను జమ చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మిని కోరారు. రాప్తాడు గ్రంథాలయాధికారి వీరనారాయణరెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

రాప్తాడు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగలకుంట గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని గ్రామస్థులు తహసీల్దార్ విజయకుమారిని కోరారు. మండలంలోని గంగలకుంట గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ అధికారులు స్పందించి శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని గ్రామస్థులు కోరారు. సర్పంచ్ తిరుపాలు, టీడీపీ నాయకులు కిష్ట, డీలర్ శాంతలింగం తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

రాప్తాడు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశానికి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని తెలిపారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం సెంట్రల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వీరేంద్ర, పీడీఓస్‌ఓ జిల్లా కన్వీనర్ అశోక్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. నాయకులు వెంకటేష్, బాలకృష్ణ, సంజీవ్ రాజు, అష్రఫ్ అలి, సంపత్, శశి తదితరులు పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీతో ఇవ్వండి

- పండ్లతోటల సంఘం నాయకుల డిమాండ్

అనంతపురం అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం జిల్లా రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు మంజూరు చేయాలని పండ్లతోటల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏపీఎంఐపీ పీడీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు చెన్నారెడ్డి, రాజారాంరెడ్డి, బీహెచ్ రాయుడు, పోతులయ్య, శ్రీనివాసులు, కొండారెడ్డి, రమేష్, చిదంబరమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

అనంతపురం కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తాము అనుకున్న భవిష్యత్ లక్ష్యాన్ని సాధించుకునేందుకు విద్యార్థి దశ నుంచే ప్రయత్నలోపం లేకుండా కృషి చేయాలని నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలామురళి పేర్కొన్నారు. మంగళవారం మూడో రోడ్డులోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు 'పరీక్షలు - ఒత్తిడి నివారణ' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వసతిగృహం హెచ్‌డబ్ల్యూఓ మారుతిప్రసాద్, ఈశ్వర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

నార్పల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం విజయవాడ సెంట్రల్ ఇన్సెక్టిసైడ్ ఇన్స్‌పెక్టర్ మనోజ్‌పూరి గోస్వామి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తనిఖీలు చేశారు. పురుగుల మందు స్టాక్, రిజిస్టర్, బిల్‌బుక్‌లు, లైసెన్స్‌ను తనిఖీ చేశారు. తిరుమల ట్రేడర్స్, సంకల్ప దుకాణాలలో పురుగు మందుల నాణ్యతను తెలుసుకొనేందుకు పురుగు మందుల నమోనాలను సేకరించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చన్న వీరస్వామి, సిబ్బంది వెంకట్‌కుమార్, ఆర్ రాకేష్ పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు


విద్యుద్దీపాలంకరణలో పాతూరు చెన్నకేశవస్వామి ఆలయం

అనంతపురం కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 10న నిర్వహించనున్న వేడుకలకు జిల్లా వ్యాప్తంగా వైష్ణవాలయాలు ముస్తాబవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని పురాతన పాతూరు చెన్నకేశవస్వామి ఆలయంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏకాదశి రోజున వైకుంఠద్వార దర్శనం కోసం వేలాది మంది భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో ఆలయాల వద్ద భక్తులు క్యూలైన్ పాటించేలా ఆలయాల వద్ద బారికేడ్లు, షేమియానాలను ఆలయాల నిర్వాహకులు మంగళవారం ఏర్పాటు చేయించారు. అదేవిదంగా ఆలయాలను రకరకాల విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

కోర్టు కేసులపై నిర్లక్ష్యం వద్దు

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరిక

అనంతపురం టౌన్, జనవరి7(ఆంధ్రజ్యోతి) : కోర్టు కేసుల విషయంలో ఏ శాఖ అధికారులు కూడా నిర్లక్ష్యం చేయడం మంచిదికాదని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో కోర్టు కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోర్టుకేసుల పరిష్కారం విషయంలో ఆయా శాఖల అధికారులే జవాబుదారీ తనంగా వ్యవహరించాలని సూచించారు. కోర్టుకేసులకు సంబంధించి ప్రత్యేకంగా నియమించిన నోడల్ అధికారులు పనిచేయాలన్నారు. న్యాయం జరగకపోతే కోర్టులకు వెళ్లాల్సివస్తుందనే పరిస్థితులు రాకుండా, అధికారుల వద్దనే పరిష్కారం జరుగుతుందనే భరోసాను ప్రజలకు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ మలోల, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ వసంతలత, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ఆయా శాఖల నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ తనిఖీ

జిల్లాకేంద్రంలోని పాతూరులో ఉన్న సీడీ ఆస్పత్రి, ఆస్పత్రి ఆవరణంలో ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకును కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బ్లడ్‌బ్యాంకులోని యంత్రాలు, రక్తనిధి కేంద్రాలను పరిశీలించారు. ఎవరికీ రక్త సమస్య తలెత్తకుండా నిల్వలు ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. అక్కడ నుంచి సీడీ ఆస్పత్రిలోకి వెళ్లి ప్రతి వార్డును పరిశీలించారు. కీలకమైన సర్జన్, గైనిక్ విభాగాలకు డాక్టర్లు లేరని చెప్పడంతో ప్రభుత్వం దృష్టికి తీసికెళతానని తెలిపారు. అక్కడే ఉన్న ప్రభుత్వ హోమియో ఆస్పత్రిని పరిశీలించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరువకొమ్మ వద్ద బస్టాప్ ఏర్పాటు చేస్తాం

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


మరువకొమ్మ వద్ద రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, జనవరి7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం సమీపంలోని మరువకొమ్మ వద్ద బస్టాప్ ఏర్పాటు చేయిస్తాని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. రోడ్డు పనులు జరిగిప్పటి నుంచి అక్కడ బస్సులు నిలపకపోవడంతో చాలా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆమె మంగళవారం నేషినల్ హైవే అధికారులతో కలసి శింగనమల మరువకొమ్మ వద్ద జరుగుతున్న ఎన్‌హెచ్ 544డి జాతీయ రహదారుల పనులను పరిశీలించారు. త్వరగా బస్టాప్ (ఓన్లీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్) కోసం నేమ్ బోర్డు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే సి. బండమీదపల్లిలో రోడ్డు కోసం భూములు కోల్పోయిన వారికి ఇంకా డబ్బులు జమ కాలేదన్నారు. ఎస్ఆర్ఐటీ వద్ద రూల్ ప్రకారమే రోడ్డు పనులు చేయించాలని అధికారులను సూచించారు. తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, ఏఈ శివకృష్ణ, సీఫైన్ రాముడు, టీడీపీ నాయకులు దండు శ్రీనివాసులు, డేగల కృష్ణమూర్తి, షాలిని, ఈశ్వర్‌రెడ్డి, కుమ్మెత చంద్రాయుడు, సత్యనారాయణ, అనిల్, మాసూల చంద్ర, అనిల్, సురేష్, చెన్నయ్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పనుల కల్పనలో ఎఫ్‌ఏల పాత్ర కీలకం

- రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనులు కల్పడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమని ఏపీ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ పేర్కొన్నారు. రాజధాని అమరావతి నుంచి మంగళవారం నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ల శిక్షణ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ మాట్లాడారు. అనంతరం నిర్వహించిన ఏపీడీల సమావేశంలో డ్వామా పీడీ సలీంబాషా మాట్లాడుతూ.. ఉపాధి పథకం అమలులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఏపీడీలు అయేషా, విజయ్‌కుమార్, అనురాధా, శైలజ, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పది మోడల్ పరీక్షలు

అనంతపురం విద్య, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు పదో తరగతి మోడల్ పరీక్షలు నిర్వహించారు. నగరంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్కూల్‌లో మంగళవారం పీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ పరీక్షలు నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ రంగస్వామి, నేతాజీ స్కూల్ హెచ్‌ఎం ప్రకాష్, అడ్వకేట్ వీరుయాదవ్, ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ ఆలం ముఖ్యఅతిథులుగా హాజరై ప్రశ్నపత్రాలు విడుదల చేశారు.

ఫుట్‌బాల్ పోటీల్లో చెన్నై, నర్మదావ్యాలీ విజయ పరంపర

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో చెన్నై, నర్మదావ్యాలీ జట్లు విజయ పరంపర కొనసాగిస్తున్నాయి. ఆర్డీటీ స్టేడియంలో ఆర్డీటీ, లాలిగా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాలుగో ఇన్‌స్పైర్ అండర్-17 జాతీయ స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం నాలుగోరోజు కొనసాగాయి. కంపాసిన్ జట్టుపై స్పోర్ట్స్ ప్లస్ అకాడమీ చెన్నై మూడు గోల్స్ తేడాతో, ఏపీ పెన్నా జట్టుపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ రెండు గోల్స్, నంది ఫౌండేషన్ గుజరాత్‌పై ఫాల్కన్ గర్ల్స్ ఒడిశా ఆరు గోల్స్ తేడాతో గెలుపొందాయి. థామ్ తమిళనాడుపై నర్మదావ్యాలీ మధ్యప్రదేశ్ ఎనిమిది గోల్స్, లిబర్టీ లేడీస్ తమిళనాడుపై బెంగుళూరు జట్టు 12గోల్స్, లైఫ్ స్పోర్ట్స్ అకాడమీపై అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్టు 15గోల్స్ తేడాతో గెలుపొందాయి.

వ్యర్థాలను తొలగించడంలో నిర్లక్ష్యం

- ఎస్సీ, ఎస్టీ ప్రజా సమాఖ్య నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వ్యర్థపదార్థాలను తొలగించడంలో నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని ఎస్సీ ఎస్టీ ప్రజాసమాఖ్య నాయకులు అన్నారు. మానవాళికి పెనుప్రమాదం పొంచిఉందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి వచ్చే వ్యర్థపదార్థాలను తొలగించడంలో నిర్లక్ష్యం చేస్తున్న సంస్థపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్సీ ఎస్టీ ప్రజాసమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లికార్జున తదితర నాయకులు మంగళవారం జిల్లా కాలుష్యనియంత్రణ మండలి ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మునిప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఈఈ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఈ దారుల్లో ప్రయాణం ఎలా..?

● ఛిద్రమైన పల్లె రహదారులు ● 10 కిలో మీటర్ల ప్రయాణానికి గంట సమయం ● గ్రామీణులకు తప్పని నరక యాతన

కళ్యాణదుర్గం/కుందుర్పి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు గుంతలమయమై అధ్వాన్నస్థితికి చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో చాలా పల్లెల రహదారుల పరిస్థితి ఇలాగే తయారయింది. కుందుర్పి మండల పరిధిలోని ఎనుములదొడ్డి, తెనగల్లు, కరిగానిపల్లి, అపిలేపల్లి, తూముకుంట, జంబుగుంపల, బెస్తరపల్లి, బొమ్మాజీపల్లి, మాయదార్లపల్లి, బసాపురం, నిజవళ్లి, మలయనూరు, శ్రీమజ్జనపల్లి, మందలపల్లి, బెస్తరపల్లి, కంబాపల్లికి వెళ్లే రహదారులన్నీ గుంతలపడి ప్రయాణానికి బేజారు తెప్పిస్తున్నాయి. కంబదూరు మండల పరిధిలోని కోటగుడ్డం, జెల్లిపల్లి, రాళ్లపల్లి, రాళ్లఅనంతపురం, ఐపార్శపల్లికి వెళ్లే రహదారులు కూడా గుంతలమయంగా మారిపోయాయి. ఈ రహదారులన్నీ దాదాపు పదేళ్ల నుంచి అధ్వాన్నస్థితికి చేరుకుని, కంకరతేలి ప్రమాదకరంగా ఉన్నాయి. అత్యవసర వైద్యం కోసం ఈ రహదారుపై వెళ్లాలంటే నరకయాతన తప్పడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కుందుర్పి మండలంలోని తెనగల్లు నుంచి కరిగానిపల్లి మీదుగా కుందుర్పికి 10 కిలోమీటర్ల ప్రయాణానికి గంట సమయం పడుతోంది. ఈ దారుల్లో బస్సు సౌకర్యం లేదు, ఆటోలు కూడా వెళ్లవు. ద్విచక్రవాహనాల్లో మాత్రమే వెళ్లాల్సిన పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బండమీదపల్లి నుంచి తంబయ్యదొడ్డి మీదుగా బొమ్మాజీపల్లి వెళ్లే రహదారిలో 9 కిలోమీటర్లు రూ.2 కోట్లతో తారు రోడ్డు వేయడానికి 2020 లో శంకుస్థాపన చేశారు. పనులు మొదటిపెట్టి కంకరపరిచి వదిలేశారు. అపిలేపల్లి నుంచి మందలపల్లి వరకు కూడా రూ. 1.89 కోట్లతో తారురోడ్డు నిర్మాణానికి కంకరపరిచి వదిలేశారు. దీంతో ఈ రహదారుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది. జంబుగుంపల నుంచి వెంకటంపల్లి మీదుగా నిజవళ్లి వరకు 11 కిలోమీటర్లకు రూ. 1.89 కోట్లతో పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. నిత్యం ద్విచక్రవాహనదారులు భయపడుతూ ప్రయాణం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ అధ్వాన్నపు రోడ్లకు మోక్షం కలిగేనా అని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారు లేరని గ్రామీణులు మండిపడుతున్నారు.




కంకరవేసి వదిలేసిన బొమ్మాజీపల్లి రహదారి, గుంతలపడ్డ కరిగానిపల్లి-అపిలేపల్లి రహదారి

ఈ రహదారుల్లో వెళ్లాలంటే నరకం



కరిగానిపల్లి నుంచి కుందుర్పి మీదుగా ఈ రహదారుల్లో వెళ్లాలంటే నరకంగా ఉంటోంది. గత పదేళ్ల నుంచి ఈ రహదారి అంతా ఇలాగే ఉంది. ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ రహదారిని బాగు చేయాలని కోరుతున్నాం.

- మోహన్, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

రోడ్డంతా గుంతలమయం



తెనగల్లు నుంచి కుందుర్పికి వెళ్లే రహదారి అంతా గుంతమయంగా మారింది. ఈ రహదారుల్లో ద్విచక్ర వాహనాల్లో వెళ్లాలంటే భయపడుతున్నాం. పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కూటమి ప్రభుత్వం వీటికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నాం.

- ఫయాజ్, తెనగల్లు, కుందుర్పి మండలం

యువశక్తితోనే దేశ పురోభివృద్ధి: విప్

రాయదుర్గం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): దేశ పురోభివృద్ధిలో యువశక్తిదే కీలకపాత్ర అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్)జిల్లా మహాసభలనుద్దేశించి ఆయన మాట్లాడారు. యువతను సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కమ్యూనిస్టుపార్టీ ప్రధానభూమిక వహించిందన్నారు. సమాజం బాగుండాలి, పది మందికి సాయపడాలనే ఆలోచించే వారెందరో, నమ్మిన సిద్ధాంతాల కోసం ఆస్తులు, ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారని అన్నారు. పార్టీ అనుబంధ సంస్థ అయినా యువజన విభాగం ఎంతో క్రియాశీలక పాత్ర పోషిస్తోందన్నారు. విద్యార్థి దశలోనే ప్రపంచ సమకాలీన అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడం ఇక్కడే సాధ్యమన్నారు. పేదరికం లేని సమాజ నిర్మాణంకోసం సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. విరివిగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించటానికి ఎంతోగానో ప్రయత్నిస్తున్నట్లు వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాలవ

కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న బీజేపీ

రాయదుర్గంరూరల్ : కార్పొరేట్ శక్తులకు బీజేపీ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. మంగళవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో 20వ జిల్లా మహాసభలను నిర్వహించారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి జూనియర్ కళాశాల గ్రౌండ్ సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర, లెనిన్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, నాయకులు నారాయణ స్వామి, మల్లికార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టి పదేళ్లయినా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో తీవ్రంగా విఫలమైనట్లు విమర్శించారు. నాయకులు గజ్జల ఈశ్వరయ్య, ఆనంద్ బాబు, కొట్రేష్, నాగార్జున, అంజనేయులు, నాగరాజు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: కలెక్టర్

ఉరవకొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): భూసమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని రేణుమాకులపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 10 మంది పేదలకు ఇంటి పట్టాలను కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సుల్లో ఇచ్చిన అర్జీలకు రసీదు తీసుకుని కంప్యూటర్‌లో నమోదు చేసుకోవాలన్నారు. సదస్సులో రైతుల నుంచి వచ్చిన అర్జీలు పరిష్కారం అయ్యాయా... లేదా.. అని పరిశీలిస్తామన్నారు. రెండు నెలలలోపు అర్జీలకు పరిష్కారమార్గం చూపుతామన్నారు. సాంకేతికతను ఉపయోగించి డ్రోన్ల ద్వారా సర్వే చేస్తామని పేర్కొన్నారు. భూమికి సంబంధించి ఎక్కువగా అన్నదమ్ముల సమస్యలే ఉన్నాయన్నారు. భూసమస్యలను మీరే పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కేఆర్సీ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, మండల ప్రత్యేకాధికారి కుష్బూ కొఠారి, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీవో రవిప్రసాద్, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, టీడీపీ నాయకులు నాగరాజు, విజయ్‌భాస్కర్, గోవిందు, శ్రీరాములు, రాధాకృష్ణ పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాల లబ్ధిదారులతో కలెక్టర్, అధికారులు

గుత్తిరూరల్ : గ్రామాల్లో భూసమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ధర్మాపురం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు ఉంటే రైతులు రెవెన్యూ సదస్సులో అర్జీలు అందజేస్తే 45 రోజులలో పరిష్కరిస్తామన్నారు. పొలాలకు వెళ్లే రస్తాల సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబులేసు, ఎంపీడీఓ ప్రభాకర్, ఏఓ ముస్తాక్ అహ్మద్, హౌసింగ్ ఏఈ సూర్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండలంలోని గుండాల తండాలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను సీఎం చంద్రబాబు రద్దు చేశారన్నారు. రైతుల భూ సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ బాధ్యుడు మణికంఠ, టీడీపీ ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, తహసీల్దారు రమాదేవి, ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ కదిరప్ప, నాయకులు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, మస్తానప్ప, రామయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికను ఏర్పాటు చేయండి

విడపనకల్లు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన విడపనకల్లుకు శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు. మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఈ మేరకు తహసీల్దార్ సునితాభాయి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. విడపనకల్లు గ్రామంలో శ్మశాన వాటికకు ప్రభుత్వం రెండు ఎకరాలు కేటాయించిందన్నారు. కానీ అర్చకుడు రుద్రముని అడ్డు పడుతున్నాడని ఫిర్యాదు చేశారు. వెంటనే దేవాలయ అధికారులు అర్చకుడు రుద్రమునిని గ్రామ సభ వద్దకు పిలిపించి మాట్లాడారు. అతడి వద్ద ఎలాంటి హక్కు ఆధారాలు లేకపోవడంతో మందలించారు. గ్రామస్థులను అడ్డుకోరాదని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకులు చంద్రశేఖర్, హనుమంతు, రామాంజనేయులు పాల్గొన్నారు.

మురుగు నీటి శుద్ధి కేంద్రానికి స్థల పరిశీలన

గుత్తి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో మురుగు నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు మంగళవారం పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదినారాయణ స్థలాన్ని పరిశీలించారు. పట్టణంలో వ్యాపారసంస్థలు, ఫ్యాక్టరీల నుంచి డ్రైనేజీలో కలుస్తున్న నీటి వలన పట్టణ ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా మురుగు నీటిని శుద్ధి చేయుటకు ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మేరకు లచ్చానుపల్లిరోడ్డు, గుత్తిఆర్ఎస్ తదితర ప్రాంతాల్లో వారు పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఈ హేమంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలేవీ..?

గుంతకల్లు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో 15వ ఆర్థిక సంఘ నిధులతో గతంలో నిర్వహించిన టెండరు వర్కులు ఇప్పటికీ చేపట్టడంలేదని, పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోరా.. అని టీడీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. మంగళవారం పురపాలక సంఘ బడ్జెట్ కేటాయింపుపై కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. చైర్‌పర్సన్ ఎన్. భవాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో టీడీపీ కౌన్సిలరు పవన్ కుమార్‌గౌడు మాట్లాడుతూ టెండర్లు నిర్వహించి పనులు చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. పలు సమావేశాల్లో ప్రశ్నించినా చర్యలు తీసుకోకపోవడంపై నిరసన వ్యక్తంచేస్తూ ఆయన కౌన్సిల్ మీటింగ్ నుంచి వాకౌట్ చేశారు. ఆయనతోపాటు మరో ఇద్దరు కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం కౌన్సిలరు కృపాకర్ మాట్లాడుతూ టీఎఫ్‌సీ నిధులతోపాటు జనరల్ ఫండ్ నుంచి వార్డులకు కేటాయించిన పనులు కూడా కాంట్రాక్టర్లు చేయడం లేదని, శానిటేషన్ పనులు జరగడం లేదని తెలిపారు. దీనిపై చైర్‌పర్సన్ భవాని, కమిషనరు నయ్యీం అహ్మద్ మాట్లాడుతూ వచ్చే మీటింగ్‌కల్లా పనులు జరిగేలా చూస్తామన్నారు. అనంతరం ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న కాలానికి సవరించిన బడ్జెట్టును, 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 50.04 కోట్ల మిగులు బడ్జెట్ అంచనాలను ప్రకటించగా, కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు అనూరాధ, మహమ్మద్ షరీఫ్, గుడిపాటి అంజనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, పాలక వర్గ సభ్యులు

సంక్షిప్త వార్తలు

నూతన భవనం ప్రారంభం



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న జేసీ శివనారాయణశర్మ

గుత్తి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనంతపురం రోడ్డులో సహకార కేంద్ర బ్యాంక్ గుత్తి బ్రాంచ్ నూతన భవనాన్ని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ మంగళవారం ప్రారంభించారు. ఆయన కౌంటర్లు పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సీఈఓ సురేఖరాణి, డీజీఎంలు సుఖదేవ్‌బాబు, రామ్‌ప్రసాద్, అప్కాబ్ డీపీడీఎం తేజేశ్వని, డీసీఓ అరుణకుమారి, నాబార్డ్ అధికారి అనురాధ, ఏడీసీసీ బ్యాంక్ మేనేజరు జానికిరాముడు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

ఉరవకొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపిడి గ్రామానికి చెందిన నారాయణస్వామి అనే వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఏఎస్ఐ పాల్ తెలిపారు. గత ఏడాది డిసెంబరు 31న పాత విషయాలను మనసులో పెట్టుకుని వంశీ, ఓబన్న అనే వ్యక్తులు నారాయణస్వామిని చంపాలన్న ఉద్ధేశ్యంతో గొడ్డలితో దాడికి పాల్పడ్డారన్నారు. అందిన సమాచారం మేరకు నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. నారాయణస్వామి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు.

దాడి కేసులో ముగ్గురు..

పుట్లూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో రెండు రోజుల క్రితం క్రిమిసంహారక మందులను పొలంలో పిచికారి చేస్తుండగా సుధాకర్ అనే వ్యక్తిపై దాడిచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో దాడిచేసిన అదే గ్రామానికి చెందిన గురువయ్య, అతడి భార్య రాజేశ్వరి, కుమారుడు భానుప్రకాష్‌ను అరెస్ట్ చేశామని మంగళవారం పోలీసులు తెలిపారు. అనంతరం తాడిపత్రి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

మట్కాబీటర్..

తాడిపత్రి, జనవరి7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నంద్యాల రోడ్డులో మంగళవారం మట్కాబీటర్ జయరామిరెడ్డిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.30వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి మట్కారాస్తుండగా అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

గుంతకల్లుటౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆ నలుగురు సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. రైల్వేస్టేషన్ రోడ్డులో మంగళవారం 40 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడన్నారు. వన్‌టౌన్ పోలీసుల సమాచారం ఇవ్వడంతో పాత గుంతకల్లులోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేష్, శ్రీధర్‌రెడ్డి, చక్రపాణి, రవీంద్ర, పురుషోత్తం, మహేష్, భాగ్యరాజ్, బాబు, వంశీ, కానిస్టేబుళ్లు సునీల్, ఎల్లప్ప పాల్గొన్నారు.

వివక్షకు గురైన కులాలనే ఎస్సీ జాబితాలో చేర్చాలి

గుంతకల్లుటౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన, అంటరానితనానికి, వివక్షతకు గురైన కులాలను మాత్రమే ఎస్సీ జాబితాలో చేర్చాలని ఎస్సీ, ఎస్టీ, దళిత ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద వారు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంతకల్లు మండలంలో గ్రామ, వార్డు సచివాలయలో మాదాసు, మాదారి కురువ ముసుగులో కులగణలో చేర్చారని తెలిపారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి నకిలీలను ఎస్సీ జాబితాలో తొలిగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓకు వినతి పత్రాన్నిఅందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహేంద్ర, కేఎల్ స్వామిదాసు, రమేష్, రామాంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం

తాడిపత్రి, జనవరి7(ఆంధ్రజ్యోతి): గంజాయితోపాటు ఇతర మత్తుపదార్థాల వాడకం వల్ల జీవితాలు నాశనమవుతాయని పట్టణ ఎస్ఐ గౌస్ తెలిపారు. పట్టణంలోని జేసీఎన్ఆర్ఎం జూనియర్ కళాశాలలో మంగళవారం మత్తుపదార్థాల వాడకంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యసనాలకు బానిస కాకుండా బాగా చదువుకోవాలన్నారు. జీవితంలో ఎప్పుడూ మాదకద్రవ్యాల జోలికి పోకూడదని హితవు పలికారు.

బాల్య వివాహాల నివారణకు కృషి చేద్దాం

కణేకల్లు, జనవరి7(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల నివారణకు అందరం బాధ్యతగా పనిచేద్దామని తహసీల్దార్ ఫణికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కిశోరి వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాల వలన అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మన్న, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఎస్ఐ శంకర్‌రెడ్డి, ఎంఈఓ-2 భవానీ శంకర్, వైద్యులు విజయ్‌కుమార్‌నాయక్, నిరీషా, సీడీపీఓ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

నైపుణ్యంతో అన్ని రంగాల్లో రాణించవచ్చు

ఉరవకొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నైపుణ్యతను పెంపొందించుకుంటే అన్ని రంగాల్లో రాణించవచ్చునని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అస్రఫ్ అలీ పేర్కొన్నారు. మండలంలోని చిన్నముష్టూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. విద్యార్థులతో ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్‌బాబు, సులోచన, ప్రాంగణ నియామక అధికారి హుస్సేన్ పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన వారితో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కొనసాగిన క్రికెట్ టోర్నమెంట్



బ్యాట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న జేసీ క్రికెట్ టోర్నమెంట్ రెండోరోజు మంగళవారం కూడా కొనసాగింది. మ్యాచ్‌లను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తిలకించారు. రెండోరోజు ఆరు జట్లు పాల్గొన్నాయి. మొదటి మ్యాచ్ సునామి సూపర్ స్ట్రైకర్స్ వర్సెస్ టైగర్ టైటాన్స్‌లో పోటీపడ్డాయి. రెండో మ్యాచ్‌లో జర్నలిస్ట్ తాడిపత్రి వర్సెస్ ఆధార్‌కార్డ్ లెవన్ మధ్య మ్యాచ్ జరిగింది. మూడో మ్యాచ్‌లో ఎస్ఎస్‌లెవన్ వర్సెస్ బీఎంబీ బాయ్స్ మధ్య, నాలుగో మ్యాచ్‌లో పెద్దపప్పూరు వర్సెస్ యర్రగుంటపల్లి జట్లు పోటీపడ్డాయి. ఐదో మ్యాచ్‌లో గుత్తిఅనంతపురం వర్సెస్ వెంకటాంపల్లి జట్లు తలపడ్డాయి. చివరిమ్యాచ్‌లో పీపీడీ వారియర్స్ వర్సెస్ టీటీడీ వారియర్స్ జట్లు పోటీపడ్డాయని నిర్వాహకులు విజ్జి, సుధీర్, కందన్ తెలిపారు.

మున్సిపల్ సమావేశం నిర్వహించండి

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి మున్సిపల్ చైర్మన్ తలారి రాజ్‌కుమార్ అడుగడుగునా అడ్డుకట్ట వేస్తున్నారని టీడీపీ కౌన్సిలర్లు మండిపడ్డారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చామన్నారు. రెండు నెలల నుంచి కౌన్సిల్ సమావేశం జరగక మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరగాలంటే కౌన్సిల్ ఆమోదం పొందాల్సి వుంటుందని తెలిపారు. దీని వల్ల శానిటేషన్, ఇంజనీరింగ్, ఇతరత్రా పనులకు నిధులు ఉపయోగించక పోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు జరిగినప్పటికీ అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. ఇదే మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్‌పై వారి పార్టీ నాయకులే కనీస మర్యాద ఇవ్వకుండా బయటకు గెంటివేసిన సంఘటనను గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అబ్రహం, నూర్జహాన్, అనిత, వెంకటేశులు, రాధిక రాణి, మహాలక్ష్మీ, రాజేశ్వరి, గంగమ్మ పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి : డీఎస్పీ

బొమ్మనహాళ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, పోలీసు సిబ్బంది పనితీరు పరిశీలించారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్ఐ నబీరసూల్‌ను ఆదేశించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి సీజ్ చేసిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హెల్మెట్ రక్షణ కవచం లాంటిదని, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా ఈ నిబంధన పాటించాలన్నారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు హనుమంతరెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కుందుర్పి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మామిడి సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాఖ శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. మంగళవారం అపిలేపల్లిలోని ఆర్ఎస్‌కేలో మామిడిసాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ మామిడి సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, పూత, పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అనంతరం మామిడి తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి గౌసియా తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులను తనిఖీ చేసిన వైద్య బృందం

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పింఛన్లు పొందే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య బృందం తనిఖీలు నిర్వహించింది. గత ప్రభుత్వంలో సదరం ద్వారా సర్టిఫికెట్లు పొంది అధిక పింఛన్లు పొందుతున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లిన నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రూ. 15 వేలు పింఛన్ తీసుకునే 31 మంది లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య బృందం చంద్రశేఖర్, వలీబాషా పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో పాల్గొన్న విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

గుత్తి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఆర్ఆర్ ఎంబీఏ కళాశాలలో చదువుతున్న సాయిసుభాష్ అనే విద్యార్థి డిసెంబరు 20 నుంచి 30 వరకు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని కిడ్స్ యూనివర్సిటీలో ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నేషనల్స్ పాల్గొన్నాడు. 400, 800 పరుగు పందెంలో పాల్గొన్నట్లు పీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ తెలిపారు. జాతీయ స్థాయి పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థిని మంగళవారం కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ శ్రీరాములు, సాయిడిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ జాతర

బెళుగుప్ప, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లిలో మంగళవారం పెద్దమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రెండు రోజులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గాజుల అంగళ్లు, బొమ్మల దుకాణాలతో వీధులన్నీ కిక్కిరిశాయి. తీర్థ ప్రసాదాల వినియోగంతో జాతర ముగిసింది. భారీ ఎత్తున ప్రజలు పాల్గొనడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. సీఐ చిన్నగౌస్, ఎస్ఐ శివ బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గుంతకల్లుటౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కోయల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం దేవాలయాన్ని కమిటీ సభ్యులు పచ్చ కర్పూరంతో శుద్ధి చేశారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

తాడిపత్రి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని, మూఢనమ్మకాలను నమ్మవద్దని జనవిజ్ఞానవేదిక జాతీయ ఉపాధ్యక్షుడు ఏవీ రమణయ్య తెలిపారు. పెద్దపొలమడ, తాడిపత్రి మోడల్‌స్కూల్‌లో మంగళవారం 'సరిగా ఆలోచించడం ఎలా' అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢనమ్మకాలను నమ్ముతూ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సేతురామేశ్వర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

మోదీ రాకపై సీపీఎం నిరసన

గుంతకల్లు టౌన్/గుత్తి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ గుంతకల్లు పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు బి. శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తూ, ప్రైవేట్ రంగంలోని మిట్టల్ కంపెనీకి అనుమతులు ఇచ్చిందన్నారు. ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు రెండు సంవత్సరాలుగా కార్మికులు, ప్రజలు పోరాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాకే నాగరాజు, రమేష్, రంగమ్మ, సురేంద్ర, చంద్రశేఖర్, రామకృష్ణ, మల్లికార్జున, మల్లేష్ పాల్గొన్నారు.